ఈనెల 6న 573.66 క్వింటాళ్ల రేషన్ బియ్యం వేలం

- జేసీ చిన్నరాముడు వెల్లడి

రాజమహేంద్రవరం అర్బన్, జూలై31(ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిధిలో నిత్యావసర వస్తువుల చట్టం కింద 6ఏ కేసుల్లో స్వాధీనం చేసుకున్న 573.66 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని (ప్రజాపంపిణీ) ఆగస్టు 6వ తేదీన ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం వేయడం జరుగుతుందని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బియ్యం వేలంలో పాల్గొనేవారు ముందురోజైన 5వ తేదీన కలెక్టరేట్‌లోని జిల్లా పౌరసరఫరాల అధికారి కార్యాలయంలో ఉన్న శాంపిల్ పీడీఎస్ బియ్యాన్ని పరిశీలించుకోవచ్చని తెలిపారు. అలాగే వేలం నిర్వహించే రోజున ఉదయం 11 గంటల లోపు ధరావత్తు కింద రూ.50 వేలను జిల్లా పౌరసరఫరాల అధికారి వారికి చెల్లించి నిర్ణీత నమూనాలో దరఖాస్తులను సమర్పించి వేలంలో పాల్గొనవచ్చని ఆయన తెలిపారు. వేలంపాటలో పాల్గొనేవారు తప్పనిసరిగా తమ జీఎస్‌టీ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ కాపీని, ధరావత్తు సొమ్ముతోపాటు సమర్పించాలని కోరారు. అయితే గతంలో 6ఏ కేసులు నమోదై పెండింగ్‌లో ఉన్న వారు వేలంపాటలో పాల్గొనేందుకు అనర్హులని జేసీ పేర్కొన్నారు.

పెరిగిన ఎన్టీఆర్ భరోసా పింఛన్లు

- నేడు పంపిణీ
- జిల్లాలో 2,36,331 మందికి రూ.103. 26 కోట్లు పంపిణీ
- కొత్తగా స్పౌజ్ పింఛన్లు 3801

రాజమహేంద్రవరం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ప్రతీ నెలా మాదిరిగా ఈనెల 1వ తేదీన కూడా ఎన్టీఆర్ సామాజిక భద్రత పింఛన్ల పంపిణీకి ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. కొత్తగా స్పౌజ్ పింఛన్ల కింద 3,801మంది ఎంపికయ్యారని, వారికి కూడా పంపిణీ చేస్తున్నామన్నారు. జిల్లాలో 2,36,331 మందికి రూ.103 కోట్ల 26 లక్షల 21 వేల 500 పింఛన్ సొమ్ము పంపిణీ చేస్తున్నామన్నారు. శుక్రవారం ఉదయం 6.30 గంటల నుంచి అన్ని సచివాలయాల పరిధిలోనూ ఈ పంపిణీ మొదలవుతుందన్నారు. ఇప్పటికే ఆయా బ్యాంక్‌ల నుంచి డబ్బు డ్రా చేసి, పంపిణీ చేసే ఉద్యోగులకు అందజేసినట్టు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల మేరకు భర్త చనిపోయిన భార్యలకు స్పౌజ్ పింఛన్ కింద జిల్లాలో 3801 మందికి రూ.1.52 కోట్లు పంపిణీ చేయనున్నామన్నారు. జిల్లాలో వృద్ధాప్య పింఛన్లు 1,11,424 ఉండగా వారికి రూ. 45.56 కోట్లు, 66,612 మందికి రూ.28.35 కోట్లు, దివ్యాంగులు 31,892 మందికి రూ.6 వేలు వంతున రూ.19.47కోట్లు, బెడ్‌రిడెన్ ఆరోగ్య పింఛన్ కింద రూ.15 వేల వంతున 1,089 మందికి రూ.1.63 కోట్లు, పంపిణీ చేస్తున్నామని చెప్పారు. కిడ్నీ, తలసేమియా, హార్ట్ ట్రాన్స్‌ప్లాంట్ బాధితులకు రూ.10 వేల వంతున 700 మందికి రూ. 70 లక్షలు, అభయహస్తం కింద రూ. 500 వంతున 5,782 మందికి రూ.29.92 లక్షలు అందజేయనున్నట్టు చెప్పారు.

రేపు రైతుల ఖాతాల్లో అన్నదాత సుఖీభవ సొమ్ములు జమ

రైతులందరూ ఈకేవైసీ తప్పసరిగా చేయించుకోవాలి : జిల్లా కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం రూరల్, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఆగస్టు 3వ తేదీన అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ యోజన పథకం కింద రూ.7 వేల చొప్పున అర్హులైన రైతుల ఖాతాల్లో నేరుగా జమ అవుతుందని జిల్లా కలెక్టర్ ప్రశాంతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్నదాత సుఖీభవ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం 1,13,000 మంది రైతులకు రూ.55 కోట్లు, పీఎం కిసాన్ యోజన పథకం కింద 1,20,000 మంది రైతులకు రూ.24 కోట్లు.. మొత్తం రూ.79కోట్లు జమవుతుందన్నారు. ఇక నిధులు సకాలంలో అందేందుకు, రైతుల బ్యాంక్ ఖాతాలు ఎన్‌పీసీఐ (నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా)తో అనుసంధానమై ఉండాలన్నారు. జిల్లాలో 1434 ఖాతాలు ఎన్‌పీసీఐతో అనుసంధానం కాలేదన్నారు. మరో 1072 ఖాతాలు అనుసంధానమైనా ఇన్ ఏక్టివ్‌లో ఉన్నాయన్నారు. రైతలు ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు. అర్హత కలిగిన రైతులందరికీ అన్నదాత సుఖీభవ సొమ్ములు జమవుతాయని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరంలేదన్నారు. ఏమైనా సందేహాలుంటే రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలని, లేదా సమీకృత కాల్ సెంటర్ 155251, వాట్సాప్ గ్రూప్ నంబరు 9552300003కు కాల్ చేయవచ్చని తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ కులాల నర్సింగ్ పట్టభద్రులకు జర్మనీలో ఉపాధి అవకాశం

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన ఎస్సీ, ఎస్టీ కులాల నర్సింగ్ పట్టభద్రులకు జర్మనీ భాషలో బీ2 స్థాయి కోసం ఉచిత శిక్షణతోపాటు జర్మనీ దేశంలో ఉపాధి కల్పించడం జరుగుతుందని జిల్లా సాంఘిక సంక్షేమ, సాధికారత శాఖ అధికారి ఎండీ షయాజుద్దీన్ తెలిపారు. ఈమేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేస్తూ ఆసక్తి కల్గి దరఖాస్తు చేసుకునే వారు 35 ఏళ్లలోపు వయస్సు కల్గి ఉండాలని, బీఎస్సీ నర్సింగ్ లేదా జీఎన్ఎం ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. అలాగే జీఎన్ఎంలు మూడు ఏళ్ళ, బీఎస్సీ నర్సింగ్ అయితే రెండేళ్ల నర్సింగ్ క్లినికల్ వృత్తిలో అనుభవం కల్గి ఉండాలని తెలిపారు. ఆసక్తి కల్గినవారు ఆగస్టు 6వ తేదీలోగా నైపుణ్యం.ఏపీ.జీఓవీ.ఇన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఎంపికైన వారికి 8 నుంచి పది నెలల వరకూ ఉచిత వసతి, భోజన సదుపాయాలు కల్పించి శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, వీసా, విమాన ఛార్జీలు, బీ2 పరీక్ష రుసుం సంబంధిత విద్యార్థినీ విద్యార్థులు చెల్లించాలని తెలిపారు. విశాఖపట్నం, గుంటూరు, తిరుపతిలో మాత్రమే శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. శిక్షణ అనంతరం ఎంపికైన విద్యార్థులకు నెలకు రూ. 2.4 లక్షల నుంచి, రూ.3.10 లక్షల వరకూ వేతనంతో కూడిన ఉపాధి జర్మనీలో కల్పించడం జరుగుతుందని తెలిపారు. పూర్తి వివరాలకు మొబైల్ 9948868862, 8340094688 నెంబర్లలో తమను సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

అపురూప చిత్రాలు! 6



బస్సుల్లో సదుపాయాలు పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

ప్రయాణం.. సాఫ్రీగా..





- మహిళలకు ఉచిత బస్సు ప్రయాణానికి ఉమ్మడి జిల్లాలో ముమ్మర ఏర్పాట్లు
- రాష్ట్రవ్యాప్తంగా ఆగస్టు 15 నుంచి ఉచిత బస్సుల్లో తిరగడానికి ప్రభుత్వం పచ్చజెండా
- జీరో ఫేర్ టికెట్‌ను గురువారం ప్రయోగాత్మకంగా విడుదల చేసిన ఆర్టీసీ
- టికెట్ జారీపై ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కండక్టర్లు, డ్రైవర్లకు శిక్షణ ప్రారంభం
- 11 డిపోల పరిధిలో టిమ్ యంత్రాల్లోను సాఫ్ట్‌వేర్ మార్పు పూర్తి
- పథకం అమల్లోకి వస్తే ఉమ్మడి జిల్లాలో 38 లక్షల మంది మహిళలకు ప్రయోజనం

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణానికి ఉమ్మడి జిల్లాలో శరవేగంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆగస్టు 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన అయిదు రకాల బస్సుల్లో మహిళలు ఫ్రీగా ప్రయాణించేందుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఫ్రీ ప్రయాణానికి జారీ చేసే జీరో ఫేర్ టికెట్‌ను గురువారం ప్రభుత్వం విడుదల చేసింది. ఉచిత ప్రయాణం అమల్లోకి వచ్చిన తర్వాత టికెట్లు ఏవిధంగా జారీ చేయాలనేదానిపై ఉమ్మడి జిల్లాలోని 11 డిపోల్లో కండక్టర్లు, డ్రైవర్లకు ఆర్టీసీ అధికారులు గురువారం నుంచి శిక్షణ కూడా ప్రారంభించారు.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

వైసీపీ ప్రభుత్వ అయిదేళ్ల పాలనలో అడ్డగోలుగా ఆర్టీసీ చార్జీలను పెంచేసి పేదల నడ్డి విరగ్గొట్టింది. కొద్దిపాటి దూరానికే షాక్‌కొట్టే చార్జీలు వసూలు చేసింది. అటు బయట పెట్రోలు, డీజిల్ ధరలు పెరగడంతో ప్రయాణం నరకప్రాయంగా మారింది. దీంతో ఇంటిని నడిపే ఇల్లాలి సంక్షేమం కోసం ఎన్నికలకు ముందు టీడీపీ ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని ప్రకటించింది. కూటమిని గెలిపిస్తే జిల్లాలో ఎక్కడ్నించి ఎక్కడికైనా ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేలా పథకం అమలుచేస్తామని హామీనిచ్చింది. ఈనేపథ్యంలో ఈ పథకాన్ని ఈనెల 15 నుంచి అమలు చేయనున్నట్టు ప్రభుత్వం ఇటీవల ప్రకటించింది. అయితే ఫ్రీబస్సు ప్రయాణం విభజిత జిల్లాకే పరిమితమా.. లేదా ఉమ్మడి జిల్లా వరకు అనుమతిస్తారా? అనే చర్చ జరుగుతున్న తరుణంలో ఏకంగా ప్రభుత్వం మహిళలకు బంపర్ ఆఫర్ ప్రకటించింది. ఉమ్మడి జిల్లా స్థానంలో ఏకంగా రాష్ట్రవ్యాప్తంగా ఉచితంగా మహిళలకు బస్సు ప్రయాణం చేయవచ్చని ప్రకటించింది. పల్లె వెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణించవచ్చని ఆర్టీసీ ఎండీ ద్వారకాతిరుమలరావు బుధవారం అధికారికంగా ధ్రువీకరించారు. ఈనేపథ్యంలో మరో రెండు వారాల్లో అమలుకానున్న ఈ పథకానికి గురువారం నుంచి ఉమ్మడి జిల్లాలోని 11ఆర్టీసీ డిపోల్లో అధికారులు ఏర్పాట్లు ముమ్మరం చేస్తున్నారు. ప్రధానంగా ఫ్రీబస్‌కు సంబంధించి జీరో ఫేర్ టికెట్ జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అంటే ఫ్రీ బస్సు ఎక్కిన మహిళలకు ప్రభుత్వం టికెట్ ఇస్తుంది. కానీ డబ్బులు చెల్లించక్కర్లేదు. టికెట్‌లో మాత్రం ప్రయాణిస్తున్న దూరానికి చార్జీ ఎంత అని కనిపిస్తుంది. అందులోనే ఆ మొత్తం రాష్ట్రప్రభుత్వ రాయితీగా చూపించి, చెల్లించాల్సిన చార్జీ సున్నాగా టికెట్‌లో ఉంటుంది. తద్వారా అసలు ఈ పథకం కింద ఎంతమంది మహిళలు ప్రయాణిస్తున్నారు? అనేది తెలుసుకోవడానికి వీలుగా ఈ టికెట్‌ను ఆర్టీసీ జారీచేయనుంది. దీనికి సంబంధించి గురువారం నమూనా టికెట్‌ను ఆర్టీసీ తొలిసారిగా విడుదల చేసింది. అయితే పథకం అమలయ్యాక జీరో ఫేర్ టికెట్ ఏవిధంగా కొట్టాలి? అనే దానిపై గురువారం నుంచి ఉమ్మడి జిల్లాలోని 11 డిపోల్లోని కండక్టర్లు, డ్రైవర్లకు ఆర్టీసీ అధికారులు శిక్షణ ప్రారంభించారు. అలాగే ఆయా డిపోల్లోని టికెట్ జారీ యంత్రాల(టిమ్) సాఫ్ట్‌వేర్‌ను సైతం మార్చే ప్రక్రియ పూర్తయింది. అలాగే పథకం అమలైన తర్వాత బస్సుల్లో మహిళా ప్రయాణికుల రద్దీ భారీగా పెరగనుంది. ఈ క్రమంలో మహిళా ప్రయాణికుల పట్ల ఏవిధంగా ప్రవర్తించాలి, ఘర్షణ పడకుండా ఏవిధంగా సంయమనం పాటించాలనే అంశాలపై అన్ని డిపోల్లోని 2,100 మంది సిబ్బందికి శిక్షణ ప్రారంభించారు.

అన్నీ ముస్తాబు..

ఉమ్మడి జిల్లాలో 11 ఆర్టీసీ డిపోల పరిధిలో మొత్తం 876 బస్సులున్నాయి. ఇందులో 532 పల్లెవెలుగు, అల్ట్రాపల్లెవెలుగు బస్సులు ఉన్నాయి. జిల్లాల వారీగా చూస్తే కాకినాడ జిల్లాలో 291 బస్సులుండగా, అందులో పల్లె వెలుగు, అల్ట్రాపల్లె వెలుగు 191, కోనసీమలో 300 బస్సులకు 176 పల్లెవెలుగు, తూర్పుగోదావరిలో 285బస్సులకు పల్లె వెలుగు, అల్ట్రాపల్లె వెలుగు ఉన్నాయి. అటు ఎక్స్‌ప్రెస్ బస్సులు వంద వరకు ఉన్నాయి. వీటన్నింటిలోనూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలుకానుంది. అయితే పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు ఉమ్మడి జిల్లా పరిధిలో తిరుగుతుండగా, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులు రాష్ట్రవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో తిరుగుతున్నాయి. వీటిలో మహిళలు ఉచితంగా ఎక్కడికైనా ప్రయాణించొచ్చు. పథకం అమలయ్యాక బస్సుల్లో రద్దీ పెరిగి లోడ్ ఎక్కువవుతుందని గుర్తించిన అధికారులు ఆయా బస్సుల్లో మార్పులు చేశారు. ఇప్పటికే డిపోల్లో ఈ ప్రక్రియ చివరకు వచ్చింది. కాగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఉచిత బస్సు ప్రయాణం 38 లక్షల మంది మహిళలకు ప్రయోజనం చేకూర్చనుంది. అయితే పథకం అమలయ్యాక డిమాండ్ మేరకు ఎక్స్‌ప్రెస్, మెట్రో బస్సుల సంఖ్యను పెంచే అవకాశం ఉంది.

8 మంది వేద పాఠశాల విద్యార్థులకు అస్వస్థత

- గొంతు నొప్పి, కడుపు నొప్పితో ఇబ్బందులు
- అన్నవరం దేవస్థానం ఆస్పత్రిలో ప్రాథమిక వైద్యం
- మెరుగైన వైద్యం కోసం తుని ఏరియా ఆస్పత్రికి తరలింపు

అన్నవరం/తునిరూరల్, జూలై 31(ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్మార్త ఆగమ పాఠశాల విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. 8 మంది విద్యార్థుల పరిస్థితి విషమంగా ఉండడంతో వీరిని దేవస్థానం ఆస్పత్రికి తరలించి చికిత్స అందించి అక్కడి నుంచి మెరుగైన వైద్యంకోసం తుని ఏరియా ఆస్పత్రికి తరలించారు. 8 మంది విద్యార్థులను ఎమర్జెన్సీవార్డుకు తరలించి ఏరియా ఆస్పత్రి వైద్యులు వైద్యచికిత్స అందిస్తున్నారు. విషయం తెలుసుకున్న కాకినాడ డీఎంహెచ్‌వో తుని ఏరియా ఆస్పత్రికి వచ్చి మెరుగైన వైద్యసేవలకు సంబంధించి వైద్యులకు పలు సూచనలు ఇచ్చారు. ఈ విద్యార్థులు రెండురోజుల కిందట అన్నవరం దేవస్థానం దిగువన కిర్లంపూడి సత్రంలో దత్త హోమంలో పాల్గొని అక్కడ అన్న ప్రసాదం స్వీకరించినట్టు సమాచారం. అన్నప్రసాదమే వికటించి తీవ్రమైన గొంతు నొప్పి, కడుపు నొప్పితో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నట్టు తెలిసింది.

కొవ్వూరులో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ ఇవ్వాలి : పురందేశ్వరి 6



కడియంలో మహిళా సంఘాలు తయారుచేసిన ఉత్పత్తులను పరిశీలిస్తున్న మంత్రి, ఎమ్మెల్యేలు

మహిళాభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కృషి

- రూ.90 వేల కోట్లు మహిళలకు రుణాలు ఇస్తున్నాం
- ఏటా లక్ష మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా చేయడమే లక్ష్యం
- సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, సెర్ప్ శాఖల మంత్రి శ్రీనివాస్

6

74 లక్షల మందికి 13 రకాల పెన్షన్లు : ఎమ్మెల్యే గోరంట్ల

కడియం, జూలై31(ఆంధ్రజ్యోతి): ప్రతీనెల 1వ తేదీ మధ్యాహ్నానికే రాష్ట్రవ్యాప్తంగా 74 లక్షల మందికి 13 రకాల పెన్షన్‌లు అందజేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదే అని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి తెలిపారు. కడియంలో గురువారం ఏడాది సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం జరిగింది. మంత్రి కె.శ్రీనివాస్‌తో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ ఏడాది పాలనలో జరిగిన అభివృద్ధిని తెలుపుతూ, సమస్యలు తెలుసుకుంటూ సుపరిపాలన కార్యక్రమం జరుగుతోందన్నారు. ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లికి వందనం పథకం అమలు చేసినట్టు తెలిపారు. త్వరలో 3 గ్యాస్ సిలెండర్లకు ఒకేసారి సొమ్ములు అందజేస్తారన్నారు. అలాగే 16 వేల మందికి ఉద్యోగాలు కల్పించారన్నారు. గత ప్రభుత్వ నిర్వాకం వల్ల జరిగిన తప్పులు సరిచేసుకుంటూ మరోవైపు సంక్షేమం, అభివృద్ధి దిశగా ప్రభుత్వపాలన సాగిస్తోందన్నారు. ఇంటింటికీ గోదావరి నీరు ఇచ్చేవిధంగా ప్రతిపాదనలు చేస్తున్నట్టు తెలిపారు. పేదరిక నిర్మూలన జరగాలనేది కూటమి ఉద్దేశం అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మోసిగంటి సత్యవతి, డాక్టర్ గోరంట్ల రవిరామ్‌కిరణ్, ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, అన్నందేవుల చంటి, మార్గాని సత్య నారాయణ, వెలుగుబంటి నాని, ప్రత్తిపాటి రామారావుచౌదరి, ముద్రగడ జమీ, కాశి నవీన్‌కుమార్, ఏఎంసీ ఛైర్మన్ మార్ని వాసు, ఉపాధ్యక్షులు బోడపాటి గోపి, ఆదిమూలం సాయిబాబా పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి, జేసీ తదితరులు

అంతరాన్ని తగ్గించడమే పీ4 లక్ష్యం : కలెక్టర్

అన్న క్యాంటీన్లలో ఆహార నాణ్యతపై అసంతృప్తి.. అధికారులు దృష్టి పెట్టాలి

రాజమహేంద్రవరం రూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మార్గదర్శి, బంగారు కుటుంబాల మధ్య అనుబంధం దీర్ఘకాలం ఉండాలన్నది ప్రభుత్వ ప్రధాన ఉద్దేశం అని జిల్లా కలెక్టర్ ప్రశాంతి పేర్కొన్నారు. ధనికులు, పేదల మధ్య అంతరం తగ్గించడమే పీ4 కార్యక్రమం లక్ష్యం అని అన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ జిల్లాల కలెక్టర్లతో అన్నదాత సుఖీభవ, పీ4 సానుకూల అభిప్రాయ సర్వే, నీటివనరుల పునరుద్ధరణ పథకాలపై గురువారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు సూచనలు చేశారు. అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి జిల్లా అధికారులకు కలెక్టర్ ప్రశాంతి పలు సూచనలు చేశారు. పీ4 మార్గదర్శకులగా ఉండమని ఎవ్వరినీ ఒత్తిడి చేయరాదన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు మార్గదర్శకులుగా ఉండడానికి ఆసక్తి కనబరిస్తే ఆహ్వానించాలన్నారు. లక్ష్యాలకు అనుగుణంగా మార్గదర్శకులు, బంగారు కుటుంబాల ఎంపికను గడువులోగా పూర్తిచేయాలన్నారు. సానుకూల ప్రజాభిప్రాయ సర్వేలో సకాలంలో చెత్త తొలగింపుపై సానుకూల అభిప్రాయం వ్యక్తమైందని తెలిపారు. అన్న క్యాంటీన్లలో ఆహార నాణ్యత కొంత అసంతృప్తి ఉందని, దీనిపై సంబంధిత అధికారులు దృష్టిసారించాలన్నారు. మహిళలపై నేరాలు జరగకుండా కఠిన చర్యలు చేపట్టాలని, దీనికి తగిన ప్రచారం ఇవ్వాలని సూచించారు. వర్షపు నీటిని ఒడిసిపట్టాలన్నది సీఎం ఆలోచన కాగా, దీనికి అనుగుణంగా నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. కాలువలు సక్రమంగా ఉన్నాయా, వాటి ద్వారా చెరువులు నిండుతున్నాయా అనే అంశాలను పరిశీలించాలన్నారు. సాగునీటి, మంచినీటి చెరువుల పునరుద్ధరణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో అమలవుతున్న ఆర్ఆర్ఆర్ పథకానికి ప్రతిపాదనలు సిద్ధంచేయాలని అధికారులను ఆదేశించారు. కొవ్వూరు, నిడదవోలులో ఉన్న పురపాలక సమస్యలపై దృష్టి సారిస్తామని జిల్లా కలెక్టర్ తెలిపారు. సమావేశంలో జేసీ చిన్నరాముడు, డీఆర్వో సీతారామమూర్తి, ముఖ్య ప్రణాళిక అధికారి అప్పలకొండ, ఇతర అధికారులు పాల్గొన్నారు.



అధికారుల తీరుపై ప్రశ్నిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

నందరాడ, నరేంద్రపురం రైతు సేవా కేంద్రాల్లో కలెక్టర్ తనిఖీ

రాజానగరం, జూలై 31(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి పేర్కొన్నారు. పీఎం కిసాన్ యోజన, అన్నదాత సుఖీభవ పథకం అమలుతీరు పరిశీలనలో భాగంగా రాజానగరం మండలంలోని నందరాడ, నరేంద్రపురం రైతు సేవా కేంద్రాలను అధికారులతో కలిసి గురువారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అలాగే రికార్డులు నిర్వహణ, డాటా ఎంట్రీ, ఇతర అనుబంధ కార్యకలాపాల తీరుపై కలెక్టర్ సమీక్షించారు. రైతులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన వారికి సమర్థవంతంగా చేరాలంటే, క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న రెవెన్యూ, వ్యవసాయశాఖ సిబ్బంది కీలకపాత్ర పోషించాల్సిన అవసరం ఉందన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న నందరాడ వీఆర్వో సీహెచ్ ముని తిరుపతి, దివాన్‌చెరువు-3కు చెందిన వీఆర్వో ఎం.సత్యనారాయణ (నరేంద్రపురం ఇన్‌చార్జ్) తీరుపై కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. తక్షణమే వారిని కలెక్టరేట్‌కు అటాచ్‌మెంట్ చేయాలని తహశీల్దార్ జి.అనంతలక్ష్మి సత్యవతిదేవిని ఆదేశించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ నరసింహకిషోర్

బ్యాంక్‌ల ఏటీఎంల వద్ద తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై ఎస్పీ సమీక్ష

రాజమహేంద్రవరంసిటీ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా పరిధిలో వివిధ బ్యాంక్‌లు, ఏటీఎం సెంటర్ల వద్ద తీసుకోవాల్సిన భద్రతాచర్యలపై ఎస్పీ డి.నరసింహకిషోర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో బ్యాంక్, సెక్యూరిటీ అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ ప్రతీ బ్యాంక్ వద్ద సీసీ కేమేరాలు, భద్రతాపరంగా తీసుకోవాల్సిన చర్యలు, పీపీటీ ద్వారా వివరించారు. ఏటీఎంల వద్ద జరిగే నేరాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని, అందులోభాగంగా బ్యాంక్ విధుల్లో నియమించుకునే తాత్కాలిక సిబ్బంది, ఔట్‌సోర్సింగ్ భద్రతా సిబ్బందికి ముందుగా పోలీస్ వెరిఫికేషన్ తప్పనిసరిగా చేయించాలని, ప్రతీ బ్యాంక్ ఏటీఎం వద్ద 24/7 పనిచేసే విధంగా నైట్ విజన్ హెచ్‌డీ సీసీ కేమేరాలు ఏర్పాటుచేసుకోవాలని, భద్రతా అలారం వ్యవస్థను ఏర్పాటుచేసుకోవాలని, విడిగా ఉన్న ఏటీఎంలు, బ్యాంక్‌ల వద్ద తప్పనిసరిగా సెక్యూరిటీ గార్డులను నియమించుకోవాలన్నారు. క్రైం అడిషనల్ ఎస్పీ ఆధ్వర్యంలో బ్యాంకులు, ఏటీఎంల వద్ద తీసుకోవాల్సిన భద్రతాపరమైన అంశాలపై బ్యాంకు, అధికారులు, సెక్యూరిటీ అధికారులతో మూడు నెలలకొకసారి రివ్యూ నిర్వహించాలని, జోనల్ డీఎస్పీలు బ్యాంక్, సెక్యూరిటీ అధికారులకు అవగాహనా కార్యక్రమాలను విధిగా నిర్వహించాలన్నారు. డిస్ట్రిక్ట్ లీడ్ బ్యాంక్ మేనేజర్ ప్రసాద్, అడిషనల్ ఎస్పీలు ఎన్‌బీఎం మురళీకృష్ణ, ఏవీ సుబ్బరాజు, ఎల్ అర్జున్, ఎస్‌బీ డీఎస్పీ బి రామకృష్ణ, పాల్గొన్నారు.



ఆమె కుంచె పట్టిందంటే చాలు... ఏ చిత్రాన్ని అయినా క్షణాల్లో ఆవిష్కరిస్తుంది. పెన్సిల్ స్కెచ్, రంగులు, రంగోలి, బ్లడ్ ఆర్ట్, పోర్ట్రయిట్ స్కెచ్... ఏదైతేనేమి ఆమె చేతిలో పడితే చాలు చూడచక్కని చిత్రం రూపుదిద్దుకుంటుంది. చిత్రలేఖనంలో నైపుణ్యం సంపాదించుకుని ఎంతో సృజనాత్మకంగా బొమ్మలు వేస్తూ అందరి అభినందనలు అందుకుంటోంది. సహజత్వం ఉట్టిపడేలా కళాత్మకంగా వేస్తున్న చిత్రాలు వహ్వా అనిపిస్తున్నాయి. ఈ బహు రూప చిత్రాల రూప శిల్పి కామిరెడ్డి రూప.





అపురూప చిత్రాలు

చిత్ర కళలో రాణిస్తున్న కామిరెడ్డి రూప



కుంచెకు రంగులద్దుతున్న రూప

కడియం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా కడియం మండలం దుళ్ల గ్రామానికి చెందిన కామిరెడ్డి రూప అత్తారిల్లు అయిన బుర్రిలంకలో స్థిరపడింది. గృహిణి అయినప్పటికీ చిత్రకళపై ఉన్న మక్కువతో బీఎస్సీ (ఫ్యాషన్ టెక్నాలజీ) చదివింది. అక్కడ చిత్రకళలో మెళకువలు నేర్చుకుని దానికి తన ప్రతిభను జోడించి చిత్రవిచిత్రంగా బొమ్మలు వేస్తూ ఆకట్టుకుంటోంది. రంగురంగుల ముగ్గులతో అద్భుత కళాఖండాలు ఆవిష్కరిస్తూ రంగోలి కళకు ప్రాభవాన్ని తీసుకొస్తోంది. రంగులతో వినాయకుడు, వేంకటేశ్వరస్వామి, పార్వతీ పరమేశ్వరులు, శ్రీకృష్ణుడు, దుర్గాదేవి వంటి దేవుని చిత్రాలతో పాటు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, ఛత్రపతి శివాజీ, గాంధీజీ వంటి మహనీయుల బొమ్మలు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ వంటి రాజకీయ నాయకుల చిత్రాలను తీర్చిదిద్దుతున్నారు. పక్షులు, జంతువులు, సెలయేర్లు, ప్రకృతి బొమ్మలతో పాటు ఊహాత్మక చిత్రాలనూ గీస్తోంది. ఈమె చిత్రాల్లో జీవకళ ఉట్టిపడుతుంది. పెన్సిల్ ఆర్ట్, గ్లాస్ పెయింటింగ్, నఖచిత్రాలను ఔరా అనిపించే రీతిలో వేస్తోంది. శారీ పెయింటింగ్ కూడా చేస్తోంది. అందమైన చిత్రాలు, కళాఖండాలతో అబ్బురపరుస్తోంది రూప.







తాను గీసిన చిత్రాలతో రూప



అమరావతి వీధి చిత్రకళా ప్రదర్శనలో రూపను అభినందిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

అవార్డులు... ప్రశంసలు



'సెల్యూట్ టు ఇండియన్ సోల్జర్స్-సిందూర్' పేరిట నిర్వహించిన నేషనల్ ఆర్ట్ కాంపిటీషన్‌లో బెస్ట్ క్రియేటివ్ ఆర్టిస్ట్ అవార్డు అందుకుంది. కడియపులంకలో మునలమ్మ తల్లి ఆలయం వద్ద జరిగిన కాంపిటీషన్‌లో మంత్రి కందుల దుర్గేశ్ నుంచి ప్రశంసలు అందుకుంది. రాజమహేంద్రవరంలో జరిగిన అమరావతి వీధి-చిత్రకళా ప్రదర్శనలో రూప చిత్రీకరించిన ఛత్రపతి శివాజీ చిత్రాన్ని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు చూసి అభినందించారు. వాడపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద రంగవల్లులతో తీర్చిదిద్దిన 8 అడుగుల వేంకటేశ్వరస్వామి చిత్రాన్ని చూసి కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానంద రావు, ఇతర ప్రముఖులు రూపను ప్రశంసలతో ముంచెత్తారు.

మంచి చిత్రకారిణిగా గుర్తింపు పొందాలనేది నా లక్ష్యం: రూప



చిత్రకారులకి ముందుగా పేషెన్సీ (ఓపిక), ఫ్యాషన్ ఉండాలి. చిన్నతనంలో సుద్దముక్కతో బొమ్మలు వేసేదాన్ని. అలా పెయింటింగ్‌పై ఆసక్తి కలిగింది. హైస్కూల్ స్థాయిలో పలు చిత్రాలకు బహుమతులు పొందాను. రాజమహేంద్రవరం మహిళా కళాశాలలో బీఎస్సీ ఫ్యాషన్ టెక్నాలజీ చదివాను. ప్రస్తుతం కాట్రేనికోనకు చెందిన క్రియేటివ్ ఆర్ట్స్ వ్యవస్థాపకుడు అంజి అకొండి వద్ద ఫైన్ ఆర్ట్స్‌లో డిప్లొమా చేస్తున్నాను. ఒక చిత్రం వేసేందుకు 2 నుంచి 4 గంటలు పడుతుంది. ఇలా అనేక చిత్రాలు వేశాను. చిత్రకారిణిగా మంచి గుర్తింపు పొందాలనేది నా లక్ష్యం.



అమ్మ అనే పదంలో అప్యాయత అనురాగం, మురిపెం అనే సుగుణాలు మిళితమై ఉన్నాయి. పుట్టిన బిడ్డకు తొలి ఆహారం, తొలి టీకా తల్లిపాలు. తల్లిపాలే పిల్లలకు అమృతం. బిడ్డ, శారీరక ఎదుగుదలకు ఇవి ఎంతగానో దోహదపడతాయి. నవజాతి శిశువుకు బలం చేకూర్చే ఆహారం తల్లిపాలే అని వైద్యులు చెప్తున్నారు. నూరు శాతం పోషక విలువలున్న తల్లిపాలు శిశువు ఆరోగ్యంగా ఎదగడంలో, ఆయుష్షు పెంచడంలో కీలక పాత్ర పోషిస్తాయి.

అమ్మపాలే అమృతం

- బిడ్డకు పాలిస్తే తల్లికి ఆరోగ్యం
- చిన్నారుల్లో రోగ నిరోధక శక్తి మెరుగు
- నేటి నుంచి 7వ తేదీ వరకు తల్లి పాల వారోత్సవాల సందర్భంగా కథనం

(ఆంధ్రజ్యోతి-అంబాజీపేట/సామర్లకోట)

తల్లిపాలు శిశువుకు సంపూర్ణమైన సంతులిత ఆహారాన్ని అందిస్తాయి. నాణ్యమైన ప్రోటీన్లు అంది మెదడు వికసిస్తుంది. ఈ పాలలో బిడ్డలకు అవసరమయ్యే విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. లాక్టోజ్ వల్ల కాల్షియం నిల్వలు పెరుగుతాయి. బిడ్డను రక్తహీనత నుంచి కాపాడతాయి. తొలి నెలలో శిశువులను వివిధ రకాల అంటువ్యాధుల బారి నుంచి కాపాడుతాయి. మనోవికాసానికి తోడ్పడతాయి. మృదువైన మల విసర్జనకు, మలబద్ధకం సమస్య నివారణకు దోహదపడతాయి. జీర్ణ మండలాన్ని వృద్ధి చేస్తాయి. తల్లి పాల ద్వారా బిడ్డలను డయేరియా, న్యుమోనియా వంటి ప్రాణాంతక వ్యాధుల నుంచి కాపాడొచ్చు. క్యాన్సర్, చెవి సంబంధిత వ్యాధులు, గుండె జబ్బుల నుంచి కూడా రక్షణ కల్పిస్తాయి. ఎలర్జీ, ఆస్తమా, డయాబెటిస్ వంటి వ్యాధులు రావు. బాల్యంలో, యవ్వనంలో ఊబకాయం వచ్చే ప్రమాదం తక్కువ.

తల్లి పాలు పుష్కలంగా రావాలంటే...

గర్భిణిగా ఉన్నప్పటి నుంచే పోషక విలువలున్న ఆహారం తీసుకోవాలి. పాలు, చేపలు, గుడ్లు, వెల్లుల్లిపాయ, తాజా కూరగాయలు, పండ్లు తగిన మోతాదులో తీసుకోవాలి. ఆహారంలో తీపి పదార్థాలు అంటే సహజంగా దొరికే పండ్లను శుభ్రంగా కడిగిన తర్వాత తినాలి.

తల్లులు పాలిచ్చే సమయంలో కెఫిన్ పుష్కలంగా ఉండే కాఫీ, శీతల పానీయాలు తీసుకోవడం మంచిది కాదు. పండ్లు, కూరగాయలు, పప్పు ధాన్యాలు తీసుకోవాలి. ద్రవాహారాన్ని పుష్కలంగా తీసుకోవాలి. బీన్స్, వేరుశెనగ, అలసందలు, తృణధాన్యాలు, డ్రైఫ్రూట్స్ ఎక్కువగా తీసుకోవాలి. ఐరన్ ఉక్కువగా ఉండే ఆహారాన్ని విటమిన్-సీతో ఇచ్చే పండ్లతో కలిపి తీసుకోవడం మంచిది. గుడ్లు, పాలు, పాల ఉత్పత్తులు, బఠానీలు, నట్స్ వంటివి తీసుకోవాలి.

తల్లికి బోలెడు లాభాలు...

శిశువుకు ముర్రుపాలు ఇవ్వడం వల్ల తల్లికి రొమ్ము, గర్భసంచి, అండాశయం మొదలగు క్యాన్సర్లు రావని వైద్య నిపుణులు చెప్తున్నారు. ప్రసవ సమయంలో స్థిరత్వం కోల్పోయిన గర్భసంచి పూర్వస్థితికి రావడం వల్ల అధిక రక్తస్రావం తగ్గుతుంది. హార్మోన్ల ప్రభావం వల్ల ఆరు నెలల వరకు అండం విడుదల కానందువల్ల గర్భధారణ జరగదు. పిల్లలకు పాలిచ్చే తల్లులు సౌందర్యవంతంగా కనిపించడంతో పాటు మానసిక రుగ్మతలు దరిచేరవు.

శిశువుకు ఎంతో మేలు...

పుట్టిన ప్రతి బిడ్డకు తల్లిపాలను ఆరు నెలల వరకు కచ్చితంగా ఇవ్వాలి. తల్లి నుంచి మొట్ట మొదట వచ్చే పాలను పిల్లలకు ఇవ్వకూడదని అపోహ ఉంది. కానీ అది సరైనది కాదు. మొదట మూడు రోజులు పాటు వచ్చే పాలలో (ముర్రుపాలు) కొలస్ట్రం ఉంటుంది. ఇది బిడ్డ ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరం. కొలస్ట్రంలో ప్రోటీన్ పాళ్లు ఎక్కువగా ఉంటాయి. ఇవి బిడ్డకు రోగనిరోధక శక్తి ఇస్తాయి. తల్లి నుంచి పాల ద్వారా బిడ్డకు ఇమ్యూనోగోబ్యులిన్స్ చేరతాయి. దీనిని పాజిటివ్ ఇమ్యూనిటీ అంటాం. దీంతో బిడ్డకు అంటువ్యాధులు రావు.

తల్లిపాల దినోత్సవం ఇలా మొదలైంది...

ఇటలీ దేశంలోని ఫ్లోరెన్స్ నగరంలో ఇన్నోసెంటి సెంటర్‌లో 1990 జూలై 30 నుంచి ఆగస్టు ఒకటో తేదీ వరకు అంతర్జాతీయ సమావేశం జరిగింది. తల్లిపాల విశిష్టతను గుర్తించిన ఆ సమావేశం ఏటా ఆగస్టు 1 నుంచి వారం పాటు తల్లిపాల వారోత్సవాలు నిర్వహించాలని నిర్ణయించింది. తల్లిపాలపై తల్లుల్లో ఉన్న అపోహలను తొలగించి, తల్లిపాల గొప్పతనం చాటి చెప్పడమే వారోత్సవాల ప్రధాన ఉద్దేశం.

అనేక పోషక విలువలు

శిశువు పుట్టిన వెంటనే తల్లి పాలు ఇవ్వాలి. ఇవి శిశువు రోగనిరోధక శక్తికి ఎంతగానో తోడ్పడతాయి. తాగే వరకు బిడ్డకు పాలు ఇస్తూనే ఉండాలి. రోజుకు కనీసం పదిసార్లు అయినా ఇవ్వాలి. ఆరు నెలలు దాటాక పాలు పూర్తిస్థాయిలో సరిపోయే అవకాశం ఉండదు. పాలు ఇస్తూనే మరోపక్క అనుబంధ పౌష్టికాహారం అందించాలి. వివిధ రకాల పోషకాలు ఉన్న ఆహారాన్ని క్రమబద్ధంగా తీసుకోవాలి. **-డాక్టర్ లక్ష్మి, గైనకాలజిస్ట్, సామర్లకోట**

తల్లీబిడ్డలకు ఆరోగ్యం



అంగన్వాడీ కేంద్రాల్లో గర్భిణులకు ముందుగానే అవగాహన కల్పిస్తున్నాం. శిశువు జన్మించాక వీలైనంత త్వరగా ముర్రుపాలు ఇవ్వాలని చెప్తున్నాం. ఇది తల్లి, బిడ్డకు ఆరోగ్యకరం. బిడ్డకు ఆరు మాసాలు వచ్చే వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలి. బిడ్డకు అవసరమైన శక్తి తల్లిపాల ద్వారానే వస్తుంది.

వై.విజయశ్రీ, సీడీపీవో, ఐసీడీఎస్ పి.గన్నవరం ప్రాజెక్టు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

తల్లి పాల విలువపై అవగాహన కల్పిస్తాం



గర్భిణులకు, బాలింతలకు తల్లిపాల వల్ల కలిగే ఉపయోగాలపై వారోత్సవాల్లో అవగాహన కల్పిస్తాం. అంగన్వాడీ కార్యకర్త నుంచి మహిళా-శిశు సంక్షేమ శాఖలో పనిచేస్తున్న వారంతా తల్లిపాల విశిష్టతను చాటి చెప్తారు. వైద్య-ఆరోగ్య శాఖకు చెందిన వైద్యులు, ఇతర సిబ్బందితో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటుచేస్తాం.

సీహెచ్ లక్ష్మి, ఐసీడీఎస్ పీడీ, కాకినాడ జిల్లా

మహిళాభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కృషి

- రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, సెర్ప్, ఎన్ఆర్ఐ సాధికారిత శాఖల మంత్రి శ్రీనివాస్



కడియంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో మంత్రి శ్రీనివాస్, గోరంట్ల

కడియం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మహిళ బాగుంటే.. ఆ కుటుంబం బాగుంటుంది.. అనే ఉద్దేశంతో మహిళాభ్యున్నతికి కూటమి ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, సెర్ప్, ఎన్ఆర్ఐ సాధికారిత శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. గురువారం కడియంలో ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ఆధ్వర్యంలో ఏడాది 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ మహిళల ఆరోగ్యం దృష్ట్యా గతంలోనే రూ. 10 వేల విలువ చేసే దీపం పథకాన్ని ఎంతోమంది మహిళలకు ఆనాడు సీఎం చంద్రబాబునాయుడు అందజేశారన్నారు. సీఎం చంద్రబాబునాయుడు 30 ఏళ్ల కిందటే రూ.10 వేలు పొదుపు ఇస్తాం.. మీరు రూ.10 వేలు కలిపి అభివృద్ధి చెందండి అని పదిమంది మహిళా సభ్యులతో డ్వాక్రా సంఘాన్ని రాష్ట్రంలో ప్రవేశపెట్టారని, అటువంటి డ్వాక్రా సంఘాలు ఐదేళ్ల తరువాత దేశంలో అన్ని రాష్ట్రాల్లో నెలకొల్పారన్నారు. ప్రతీ ఏటా లక్ష మంది పారిశ్రామికవేత్తలను తయారుచేయాలని సీఎం చంద్రబాబునాయుడు ఆదేశాలు ఇచ్చారన్నారు. అందుకోసం మహిళలకు రుణాలు ఇప్పించడంతో పాటు వారికి శిక్షణ ఇప్పిస్తున్నట్టు తెలిపారు. వారి పిల్లల చదువుకోసం, వివాహాల కోసం, ఆరోగ్యం కోసం ఇలా స్త్రీనిధి కింద మహిళలకు రూ.లక్ష ఇవ్వడం జరుగుతుందన్నారు. కూటమి ఏర్పడిన ఏడాది కాలంలో గత నాలుగు నెలలుగా రాష్ట్ర వ్యాప్తంగా 27 వేల కోట్లు రుణాలు ఇవ్వడం జరిగిందన్నారు. మొత్తం 90 వేల కోట్ల రుణాలు మహిళలకు ఇవ్వనున్నామన్నారు. అలాగే అర్హులైన ప్రతీ ఒక్కరికి రూ.4 వేలు, దివ్యాంగులకు రూ.6 వేలు, దీర్ఘకాలిక సమస్యలు ఉన్న వారికి రూ.10 వేలు, మంచానికే పరిమితమైన వారికి రూ.15 వేల పెన్షన్‌ను ప్రభుత్వం అందిస్తోందన్నారు. రైతులకు ఆగస్టు నెల నుంచి రూ.7 వేల చొప్పున 2 దఫాలుగాను, ఓ దఫా రూ.6 వేల చొప్పున మొత్తం రూ. 20 వేలను ప్రభుత్వం అందిస్తోందన్నారు. వైద్యం కోసం సీఎం రిలీఫ్ ఫండ్ కింద కోట్లాది రూపాయలను ప్రభుత్వం అందిస్తోందన్నారు. గ్రామాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని, కూటమి పాలనలో ఇప్పటివరకు ప్రతీ గ్రామంలో రూ.25 లక్షల నుంచి రూ. 50 లక్షల అభివృద్ధి జరిగిందన్నారు. గత ప్రభుత్వంలో పెట్టుబడులు పెట్టడానికి వచ్చేవారిని బెదరగొట్టి పెట్టుబడులు రాకుండా చేశారని, అయితే కూటమి ఏర్పడిన ఏడాది కాలంలో రాష్ట్రానికి రూ. 8 లక్షల కోట్లు పెట్టుబడులు వచ్చాయన్నారు. హైదరాబాదులో హైటెక్ సిటీ మాదిరిగా ప్రస్తుతం అమరావతి అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. గతంలో ఒక్క చాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన నాయకుడి వల్ల 20 ఏళ్ల రాష్ట్రాభివృద్ధి వెనుకకుపోయిందని మంత్రి శ్రీనివాస్ ఆరోపించారు.

స్కిల్ డెవలప్‌మెంట్, పీఏసీఎస్ డిజిటలైజేషన్‌లో ఏపీకి ప్రాధాన్యత

- ఎంపీ సతీష్‌బాబు ప్రశ్నకు కేంద్ర మంత్రుల సమాధానం

కాకినాడ సిటీ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): స్కిల్ డెవలప్‌మెంట్, పీఏసీఎస్ డిజిటలైజేషన్‌లో ఏపీకి సహాయం, ప్రాధాన్యత ఇస్తున్నట్టు రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు పార్లమెంట్‌లో అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రులు సమాధానం ఇచ్చారు. నైపుణ్యాభివృద్ధి, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల డిజిటలైజేషన్ రంగాల్లో రాష్ట్రానికి ఇస్తున్న ప్రాధాన్యపై ఎంపీ కేంద్రాన్ని ప్రశ్నించారు. దీనికి కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి జయంత్ చౌదరి సమాధానమిస్తూ ఫ్యూచర్ స్కిల్స్, డిజిటల్ టెక్నాలజీ శిక్షణలో భాగంగా కాకినాడలో ఇప్పటివరకు 192 మందికి రూ. 13.20 లక్షలు వెచ్చించి శిక్షణ ఇచ్చామన్నారు. పీఏసీఎస్ డిజిటలైజేషన్ అంశంపై కేంద్ర సహకార శాఖ మంత్రి అమిత్‌షా సమాధానమిస్తూ ఏపీలో 2037 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలుండగా, అందులో 2020 కేంద్రాల్లో ఈ ఏడాది జూన్ నాటికి ఈఆర్‌పీ వ్యవస్థ అమలులోకి వచ్చిందన్నారు. మిగిలిన 17 పీఏసీఎస్‌ల డిజిటలైజేషన్ పనులు జరుగుతున్నాయని వెల్లడించారు.

అష్ట జ్యోతిర్లింగాలకు ప్రత్యేక ఆర్టీసీ సర్వీసులు

రావులపాలెం, జూలై 31(ఆంధ్రజ్యోతి): అష్ట జ్యోతిర్లింగాలు, పంచద్వారకాలకు రావులపాలెం ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక నాన్ ఏసీ, స్లీపర్ కోచ్ బస్సులు నడుపుతున్నట్టు డిపో మేనేజర్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రావులపాలెం డిపో నుంచి బయలుదేరి బసవకళ్యాణ్, తుల్జాపూర్, భీమశంకరజ్యోతిర్లింగం, పర్లిబైద్యనాథ్ జ్యోతిర్లింగం, షిర్డీ, గృష్ణేశ్వర్, జ్యోతిర్లింగం, ఎల్లోరా, నాసిక్, త్రయంబకేశ్వర జ్యోతిర్లింగం, ఢాకోర్, నిష్కలంక మహాదేవ్, బాగ్దాన, సోమనాథ్ జ్యోతిర్లింగం, నాగేశ్వరజ్యోతిర్లింగం, ద్వారక, బెట్ ద్వారక, ముదేరా, నాథద్వార్, రాజ్యసముండ కంక్రోలి, ఉజ్జయిని మహాకాలేశ్వర్ జ్యోతిర్లింగం, ఓంకారేశ్వరజ్యోతిర్లింగం, ఏకవిరిక శక్తిపీఠం, బాసర దర్శనాలు కల్పించడం జరుగుతుందన్నారు. ఈ నెల 25వ తేదీన బస్సు బయలుదేరి తిరిగి సెప్టెంబరు 8వ తేదీన రావులపాలెం డిపోకు చేరుకుంటుందన్నారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, రాత్రి టిఫిన్‌తో కలిసి టిక్కెట్టు ధర రూ. 21000గా నిర్ణయించడం జరిగిందన్నారు. మరిన్ని వివరాలకు అసిస్టెంట్ మేనేజర్ 7382911871, 9959225549 ఫోన్‌నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

మంగళగిరి డీఐజీ ప్రత్యేక పూజలు



సుదర్శన హోమంలో పాల్గొన్న డీఐజీ లక్ష్మి దంపతులు

సర్పవరంజంక్షన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్‌లో వెలసిన రాజ్య లక్ష్మీ సమేత భావనారాయణ స్వామి వారిని గురువారం మంగళగిరి డీఐజీ ఎస్ఎస్‌జే లక్ష్మి దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీనిలో భాగంగా సుదర్శన హోమంలో పాల్గొన్నారు. వీరికి ఆలయ ఈవో టీవీ సూర్యనారాయణ ఆలయ సంప్రదాయాలతో స్వాగతం పలుకుతూ ఆలయ విశిష్టత, చరిత్ర గురించి వివరించారు. అనంతరం స్వామివారి చిత్రపటం, తీర్థప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

పార్మా- అకడమిక్‌లతో స్థిరమైన అభివృద్ధి

- ఆదికవి నన్నయ వర్సిటీ వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ
- స్థిరమైన వృద్ధికి ఔషధ-విద్య సమన్వయంపై అంతర్జాతీయ వర్క్‌షాప్



వీసీను సన్మానిస్తున్న అధ్యాపకులు

దివాన్‌చెరువు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఆవిష్కరణలతోనే ఔషధ పరిశ్రమ అభివృద్ధి చెందుతుందని, సామాజిక అవసరాలను పరిశోధనలు తీర్చినపుడు విద్యారంగం ఔచిత్యం పొందుతుందని ఆదికవి నన్నయ వర్సిటీ వీసీ ఆచార్య ఎస్. ప్రసన్నశ్రీ అన్నారు. దివాన్‌చెరువులోని వర్సిటీలో స్థిరమైన వృద్ధికి ఔషధ-విద్య సమన్వయం అనే అంశంపై గురువారం అంతర్జాతీయ వర్క్‌షాప్ నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వీసీ జ్యోతిప్రజ్వలన చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ స్థిరమైన ఆవిష్కరణలను పెంపొందించడానికి ఔషధ పరిశ్రమ, విద్యా పరిశోధన కలిస్తే అత్యాధునిక అవకాశాలు, సహకార మార్గాలను కనుగొనవచ్చన్నారు. పర్యావా లైఫ్‌సైన్సెస్ గ్రూప్ భారత్, యూకే ఆపరేషన్స్ చీఫ్ హెచ్ఆర్ డాక్టర్ కుమార్‌రాజా చిట్టూరి మాట్లాడుతూ ఔషధ రంగంలో మానవ వనరుల ఆవశ్యకత, నైపుణ్యాభివృద్ధిపై ప్రసంగించారు. అమెరికా నుంచి ఫార్మా స్యూటికల్స్ క్వాలిటీ అస్యూరెన్స్ డైరెక్టర్ డాక్టర్ విష్ణు మారిశెట్టి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అలాగే మద్రాస్ ఐఐటీ నుంచి ప్రొఫెసర్ బీరయ్య బైరి, బయోఎనికో సొల్యూషన్స్ డైరెక్టర్ బి.సతీష్‌మోహన్ హాజరై పలు విషయాల గురించి వివరించారు.కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి, వర్క్‌షాప్ కన్వీనర్ ఆచార్య బి.జగన్మోహనరెడ్డి, కో-కన్వీనర్ కె.దీప్తి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీతో ఉత్తమ క్రమశిక్షణ

- ఏపీ, తెలంగాణ ఎన్‌సీసీ అధికారి నర్సింగ్ సైలాని

పెద్దాపురం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఎన్‌సీసీలో చేరితే ఉత్తమ క్రమశిక్షణ అలవడుతుందని ఐడీఎస్ఎస్‌సి, ఏపీ, తెలంగాణ ఎన్‌సీసీ అధికారి, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎయిర్ కమాండర్ నర్సింగ్ సైలాని అన్నారు. గురువారం కాకినాడ జిల్లా పెద్దాపురంలోని శ్రీప్రకాష్ సినర్జీ పాఠశాలలో జరుగుతున్న ఎన్‌సీసీ క్యాంపును సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవితంలో ఎదురయ్యే కష్టాల నుంచి ఎన్‌సీసీ బయటపడేసి ఉత్తమ జీవితానికి బాటలు వేస్తుందన్నారు. పాఠశాలలో వసతి బాగుందని ప్రశంసిస్తూ డైరెక్టర్ సీహెచ్ విజయ్‌ప్రకాష్‌ను సత్కరించారు. అనంతరం ఆంధ్ర, తెలంగాణకు సంబంధించి ఐడీఎస్ఎస్‌సీ టీం టీషర్ట్‌ను ఆవిష్కరించారు. రైఫిల్ షూటింగ్‌లో ఎంపికైన విద్యార్థులకు కిట్స్ అందజేశారు. కాకినాడ గ్రూప్ కమాండర్ కల్నల్ రితిన్‌మోహన్ అగర్వాల్, కల్నల్ హెచ్ఎస్ మౌనిక, మేనేజర్ మహమ్మద్ ఆసిఫ్, ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక యాత్రకు .. ఇండియన్ రైల్వే శ్రీకారం

- సెప్టెంబర్ 9న మహాలయ పక్ష ప్రత్యేక సప్త మోక్ష యాత్ర ప్రారంభం

కాకినాడ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పవిత్ర పుణ్య క్షేత్ర దర్శనాలే లక్ష్యంగా ఆధ్యాత్మిక యాత్రకు శ్రీకారం చుట్టామని ఇండియన్ రైల్వేస్ సౌత్ స్టార్ రైల్ అండ్ టూర్ టైమ్స్ డైరెక్టర్ విఘ్నేష్ జీ తెలిపారు. గురువారం కాకినాడ ప్రెస్ క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మహాలయ పక్ష ప్రత్యేక సప్త మోక్ష యాత్ర పేరుతో ఈ యాత్ర సెప్టెంబర్ 9న ప్రారంభమవుతుందన్నారు. ఇందులో గూడూరు, నెల్లూరు, ఒంగోలు, చీరాల, గుంటూరు, మిర్యాలగూడ, నల్గొండ, హైదరాబాద్, కాజీపేటస్టేషన్లో యాత్రికులు రైలు ఎక్కే వీలుందన్నారు. 15 రోజులపాటు జరిగే ఈ యాత్రకు ఇండియన్ రైల్వేస్, భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలు, సౌత్ స్టార్ రైలు, భారత ప్రభుత్వ పర్యాటక మంత్రిత్వశాఖ గుర్తింపు పొందిన టూరిస్ట్ రైలు ఆపరేటర్ 'టూర్‌టైమ్స్ నడుంబిగించిందన్నారు. ఈయాత్రలో ఉజ్జయిని, ఓంకారేశ్వర్, ద్వారకా, సిద్ధపూర్, మధుర, అయోధ్య, ప్రయాగ్‌రాజ్, వారణాసి, గయ కవర్ చేస్తామన్నారు. టూర్ టైమ్స్ జనరల్ మేనేజర్ సంతోష్ మాట్లాడుతూ యాత్రికులకు దక్షిణ భారత భోజనం, ఇతరత్రా సదుపాయాలు ట్రైన్ లోపల కల్పిస్తున్నామన్నారు. ఈ ప్యాకేజీపై ఇండియన్ రైల్వే 33 శాతం సబ్సిడీ ఇస్తుందన్నారు. ఇతర వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.టూర్‌టైమ్స్.ఇన్ వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చన్నారు.

'గోదావరి' తగ్గుముఖం

ధవళేశ్వరం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రెండురోజులుగా తగ్గుముఖం పడుతున్న గోదావరి వరద ప్రవాహం గురువారం మరింత తగ్గింది. సాయంత్రానికి ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ నుంచి 4,52,898 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. వ్యవసాయ అవసరాల కోసం తూర్పు డెల్టాకు 4,800 క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 2600 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 7000 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువున భద్రాచలం వద్ద తగ్గుముఖం పడుతున్న నీటిమట్టం గురువారం సాయంత్రానికి 29.20 అడుగులుగా నమోదయింది.

కొవ్వూరులో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ ఇవ్వాలి : ఎంపీ

కొవ్వూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరులో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్‌ను పునరుద్ధరించాలని రైల్వే బోర్డు చైర్మన్‌కు బీజేపీ నేత, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు ఢిల్లీలోని రైల్వేభవన్‌లో చైర్మన్ సతీష్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అలాగే రానున్న గోదావరి పుష్కరాల నేపథ్యంలో రాజమహేంద్రవరం, గోదావరి, కొవ్వూరు, నిడదవోలు, అనపర్తి రైల్వేస్టేషన్లలో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని కోరారు.

కమ్మేసిన కారు మబ్బులు



గురువారం సాయంత్రం రాజమహేంద్రవరంలోని పుష్కరాల రేవులో కారుమబ్బులు కమ్మేశాయి. శివుడు, పుష్కరాల రేవులో ఉన్న ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఏర్పడిన చూడముచ్చటైన దృశ్యాలు

–స్టాఫ్ ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం



హాకీ పోటీలకు సర్వం సిద్ధం

- క్రీడాకారుల రాకతో సందడిగా మారిన మైదానం
- నేటి నుంచి జాతీయ జూనియర్స్ హాకీ టోర్నమెంట్
- దేశవ్యాప్తంగా 28 రాష్ట్రాల నుంచి క్రీడాకారుల రాక
- 600 మంది క్రీడాకారులు, కోచ్‌లు
- ఏర్పాట్లను పరిశీలించిన అధికార యంత్రాంగం

కార్పొరేషన్(కాకినాడ), జూలై 31 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో శుక్రవారం నుంచి జరుగనున్న 15వ జాతీయ మహిళా జూనియర్ హాకీ ఛాంపియన్‌షిప్‌కు సంబంధించి ఏర్పాట్లను జిల్లా అధికార మంత్రాంగం సర్వంసిద్ధం చేసింది. రెండు మూడు రోజుల ముందు నుంచే క్రీడాకారులు ఆయా రాష్ట్రాల నుంచి క్రీడామైదానానికి చేరుకోవడంతో క్రీడా మైదానం సందడిగా మారింది. దేశవ్యాప్తంగా 28 రాష్ట్రాల నుంచి సుమారు 600 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారు. 50మంది పీడీలు ఈ క్రీడలను పర్యవేక్షించనున్నారు. జిల్లా కలెక్టర్ షాన్మోహన్ ఆధ్వర్యంలో జిల్లా మంత్రాంగం గత పదిరోజులుగా వచ్చిన క్రీడాకారుల వసతి వంటి ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ సర్వం సిద్ధం చేశారు. వచ్చిన క్రీడాకారులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు తగిన చర్యలు చేపట్టారు. గురువారం ఫ్రీడమ్ మైదానంలో క్రీడాకారులు సందడిగా కనిపించారు. కొంతమంది క్రీడాకారులు గుంపులు గుంపులుగా సేద తీరుతున్నారు. మరికొందరు వారు క్రీడా పరికరాలను సిద్ధం చేసుకుంటున్నారు. ఇంకొంతమంది హాకీ మైదానంలో ప్రాక్టీస్ చేస్తూ కనిపించారు. మరి కొంతమంది కాకినాడ బీచ్‌కు వెళ్లి సందర్శించారు. 12వ తేదీ వరకు జరుగునున్న ఈ పోటీలు ముగిసేవరకు క్రీడా మైదానంతో పాటు క్రీడాకారులతో కాకినాడ నగరం సందడిగా మారనుంది.



హాకీ పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన క్రీడాకారిణులు

వసతి సౌకర్యం..

సామర్లకోటలో ఎక్స్టెన్షన్ ట్రైనింగ్ సెంటర్ (ఈటీసీ), సర్వే ట్రైనింగ్ అకాడమీ (ఎస్‌టీఏ), టీటీడీసీ క్యాంపస్, కాకినాడలో జేఎన్టీయూ ఉమెన్స్ హాస్టల్, బాలాచెరువు సెంటర్ జీఎంసీ బాలయోగి అంబేడ్కర్ హాస్టల్, గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజ్ హాస్టల్, శ్యామ్ ఇన్‌స్టిట్యూట్, అచ్చంపేట ఆదికవి నన్నయ యూనివర్సిటీ క్యాంపస్ ప్రాంతాల్లో క్రీడాకారులకు వసతి సౌకర్యం కల్పించారు.

ప్రతిభ చాటిన క్రీడాకారులకు శిక్షణ ఇస్తాం

- హాకీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు నిరంజన్ రెడ్డి

కార్పొరేషన్ (కాకినాడ), జూలై 31 (ఆంధ్రజ్యోతి):కాకినాడ జిల్లా క్రీడామైదానంలోని హాకీ ఫీల్డ్‌వద్ద హాకీ ఆంధ్రప్రదేశ్ కార్యవర్గ సభ్యులు శుక్రవారం నుంచి జరిగే 15వ జాతీయ మహిళా జూనియర్ హాకీ ఛాంపియన్‌షిప్‌కు సంబంధించి గురువారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హాకీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు ఎం.నిరంజన్‌రెడ్డి, కార్యదర్శి బి.చాణుక్యరాజు, జి.హర్షవర్ధన్ మాట్లాడుతూ ఈ ఛాంపియన్‌షిప్‌లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఎంపికచేసి ఢిల్లీలో శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణా కాలంలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఇండియా హాకీ టీంకు ఎంపిక చేస్తామన్నారు. దేశవ్యాప్తంగా 28 రాష్ట్రాల నుంచి 600 మంది క్రీడాకారులు, కోచ్‌లు ఈ పోటీలో పాల్గొంటారని తెలిపారు. స్థానికంగా 50 మంది పీడీలు పర్యవేక్షణ చేస్తారన్నారు. 2026-27లో జరిగే జూనియర్ ఉమెన్స్ ఇండియా హాకీ జట్టును తయారు చేసి పోటీలకు పంపేందుకు సిద్ధం చేస్తున్నామన్నా రు. కాకినాడలో 12వ తేదీన హాకీ జూనియర్ ఉమెన్స్ నేషనల్ ఛాంపియన్‌షిప్ 2025 పోటీలను దిగ్విజయంగా నిర్వహించి స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, జిల్లా కలెక్టర్ షాన్మోహన్ మాకు అన్నిరకాలుగా పూర్తి సహాయసహకారాలు అందిస్తున్నారన్నారు. వీరితో పాటు స్థానికంగా ఉన్న డీఎస్‌డీవో శ్రీనివాసకుమార్, హాకీ సీనియర్ కోచ్ వి.రవిరాజు, ఇతర కార్యవర్గ సభ్యులు సహాయసహకారాలు అందించి సమిష్టిగా పనిచేసి టోర్నమెంట్‌ను విజయవంతం చేసి హాకీ ఆంధ్రప్రదేశ్‌కు పేరుప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న హాకీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు నిరంజన్ రెడ్డి

మతిస్థిమితం లేని వ్యక్తి జగన్

- ఆయన పర్యటనలను పట్టించుకోవాల్సిన అవసరం లేదు
- రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్
- రాజమహేంద్రవరం ఈఎస్‌ఐ ఆసుపత్రిలో అంబులెన్స్ సర్వీసులు ప్రారంభం
- ఈఎస్‌ఐ ఆసుపత్రి నూతన భవనాన్ని సెప్టెంబరులో ప్రారంభిస్తామని వెల్లడి



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

రాజమహేంద్రవరంఅర్బన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి మతిస్థిమితం లేని వ్యక్తి అని, ఆయన పర్యటనలను పట్టించుకోవాల్సిన అవసరం లేదని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆరోపించారు. రాజమహేంద్రవరంలో నిర్మాణంలో ఉన్న ఈఎస్‌ఐ నూతన భవనాన్ని ఈ ఏడాది సెప్టెంబరులో ప్రారంభిస్తామని వెల్లడించారు. గురువారం సాయంత్రం రాజమహేంద్రవరంలోని ఈఎస్‌ఐ ఆసుపత్రిలో సీఎస్ఆర్ నిధులతో యూనియన్ బ్యాంకు సమకూర్చిన అత్యాధునిక సౌకర్యాలతో కూడిన అంబులెన్స్ సర్వీసులను ఆయన ప్రారంభించారు. మంత్రి సుభాష్ మీడియాతో మాట్లాడుతూ కార్మికుల ఆరోగ్యం, సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని అన్నారు. అన్నవరం, తిరుపతి ఈఎస్‌ఐ ఆసుపత్రుల్లో సౌకర్యాలు మెరుగుపరుస్తామని, కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. రాజమహేంద్రవరం ఈఎస్‌ఐ ఆసుపత్రికి రోజూ 200 నుంచి 300 మంది రోగులు వైద్యం కోసం వస్తున్నారని, కార్మికులకు బీమా చెల్లింపులో యాజమాన్యాల నిర్లక్ష్యం ఉంటే శాఖాపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి అన్నారు. త్వరలో అమరావతిలో 150 పడకలతో సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిని నిర్మించనున్నామన్నారు. ఫ్యాక్టరీలు, ఇతర కర్మాగారాల్లో జీరో ఇన్సిడెంట్స్ లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటించని ఫ్యాక్టరీలకు అనుమతులు మంజూరు చేయబోమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీమా మెడికల్ సర్వీసెస్ డైరెక్టర్ వి.ఆంజనేయులు, యూనియన్ బ్యాంకు రీజనల్ మేనేజర్ ఏ.విశ్వేశ్వరరావు, ఈఎస్‌ఐ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ స్టేట్ ఛాంపియన్‌గా

రాజమండ్రి కుర్రోడు మోహిత్ ఎంపిక



ఛాంపియన్‌షిప్ ట్రోఫీని అందుకుంటున్న మోహిత్

రాజమహేంద్రవరం, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ స్టేట్‌చాంపియన్ 2025 టైటిల్‌ను రాజమహేంద్రవరం కుర్రాడు సాధించాడు. దీంతో చారిత్రక రాజమహేంద్రవరానికి క్రీడా పరంగా కూడా మళ్లీ పేరు వచ్చింది. రాజమహేంద్రవరానికి చెందిన కొత్తపల్లి బాలు కుమారుడు కొత్తపల్లి మోహిత్ (18) ఈ టైటిల్ ను సాధించారు. ఈనెల 28నుంచి 31వరకూ తిరుపతిలో చిత్తూరుజిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ సీనియర్ బాడ్మింటన్ చాంపియన్‌షిప్-2025 పోటీలను మెన్ అండ్ విమెన్ విభాగాలలో నిర్వహించారు. గురువారం ఫైనల్ పోటీలలో మెన్ విభాగంలో కొత్తపల్లి మోహిత్ విజేతగా నిలిచాడు. రాజమహేంద్రవరానికి చెందిన మోహిత్ సుమారు 10ఏళ్ల నుంచి ప్రాక్టీస్ చేస్తున్నారు. 18ఏళ్ల వయస్సుగల ఈ యువకుడు విజయవాడలో బీబీఏ చదువుతున్నారు. ప్రతిష్ఠాత్మకమైన బ్యాడ్మింటన్ పోటీలలో స్టేట్ చాంపియన్‌గా ఈప్రాంత యువకుడు నిలవడంతో అందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రమంత్రి కందుల దుర్గేష్, ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరి, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఆదిరెడ్డివాసు, ఎమ్మెల్సీ సోమువీర్రాజు, అనుశ్రీ అధినేత సత్యనారాయణ తదితరులు ఈ యువకుడిని అభినందించారు.యువకుడి తండ్రి బాలు మాట్లాడుతూ తన కుమారుడు ఛాంపియన్‌గా నిలవడం చాలా ఆనందంగా ఉందని, త్వరలో ఏడు రాష్ట్రాల పరిధిలో జరిగే సౌత్‌జోన్ పోటీలకు హాజరుకానున్నాడని, నవంబరు లేదా డిసెంబర్‌లో జరిగే నేషనల్ ఛాంపియన్‌షిప్ పోటీలకుస్టేట్‌చాంపియన్‌గా పాల్గొంటాడన్నారు.

ముగిసిన టేబుల్ టెన్నిస్ పోటీలు

- జాతీయస్థాయి పోటీలకు 42 మంది విద్యార్థుల ఎంపిక



విద్యార్థులకు మెమెంటోలు అందజేస్తున్న దృశ్యం

ఎటపాక, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఎటపాక జవహర్ నవోదయ విద్యాలయంలో మూడురోజులుగా నిర్వహిస్తున్న రీజనల్ స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు గురువారంతో ముగిశాయి. ఈ పోటీల్లో పాల్గొన్న 96 మంది విద్యార్థుల్లో 42మంది విద్యార్థులు నేషనల్‌స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు ఎంపికైనట్లు నవోదయ విద్యాలయం వైస్ ప్రిన్సిపాల్ తెలిపారు. ఇందులో 21మంది బాలికలు, 21 మంది బాలురు ఎంపికైనట్లు చెప్పారు. అండర్-14 బాలికల నుంచి ఏడుగురు, అండర్-14 బాలుర నుంచి ఏడుగురు, అండర్-17 బాలికల నుంచి ఏడుగురు, అండర్-17 బాలుర నుంచి ఏడుగురు, అండర్- 19 బాలికల నుంచి ఏడుగురు, అండర్-19 బాలుర నుంచి ఏడుగురు విద్యార్థులు సెలక్ట్ అయ్యారు. వీరంతా ఈనెలలో అస్సాంలో జరు గనున్న నేషనల్‌స్థాయి టెబుల్ టెన్నిస్ పోటీల్లో పాల్గొననున్నారు. అనంతరం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులందరికీ మెడల్స్‌తోపాటు సర్టిఫికెట్లను అందజేశారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందిన క్లస్టర్ల విద్యార్థులకు కూడా మెమెంటోలు అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి

తాళ్లరేవు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కాకినాడజిల్లా తాళ్లరేవు మండలం కోరింగ వద్ద 216 జాతీయ రహదారిపై గురువారం జరిగిన ప్రమాదంలో వృద్ధురాలు మృతి చెందింది. ఎస్‌ఐ పి.సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం... డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం పెదమడి గ్రామానికి చెందిన మందపాటి సుభద్రమ్మ (67), ఆమె భర్త సూర్యనారాయణరాజు కాకినాడ కారులో వెళ్లి తిరిగివస్తుండగా కోరింగ పోలీసుస్టేషన్ ప్రాంతంలో యానాం నుంచి కాకినాడ వెలుతున్న ఆర్టీసీ బస్సును అదు పుతప్పి ఢీకొట్టింది. దీంతో సుబద్రమ్మ అక్కడికక్కడే మరణించింది. సూర్యనారాయణరాజుకు గాయాలు కాగా కాకినాడ ఆసుపత్రికి తరలించారు. సుబద్రమ్మ మృతదేహాన్ని అంబులెన్స్‌లో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి మార్చురీకి పోలీసులు తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ చెప్పారు.



సంఘటనాస్థలంలో మృతిచెందిన సుభద్రమ్మ

బాలికపై అత్యాచారం

- పోక్సో చట్టం కింద కేసు నమోదు

అల్లవరం, జూలై 31(ఆంధ్రజ్యోతి): ప్రేమించుకుందాం.. పెళ్లి చేసుకుంటానని నమ్మించి 16 ఏళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడ్డ యువకుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. అల్లవరం మండలం ఒక గ్రామంలో ఒక బాలికను నమ్మించి అయినవిల్లి మండలం మాగాం గ్రామానికి చెందిన నవుంద్రు రాకేష్ అనే యువకుడు అత్యాచారానికి పాల్పడ్డాడని బుధవారం బాలిక తల్లిదండ్రులు అల్లవరం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాలికను అత్యాచారం చేసిన అభియోగంపై నవుంద్రు రాకేష్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశామని అల్లవరం ఎస్‌ఐ బి.సంపత్‌కుమార్ విలేకరులకు తెలిపారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

కొవ్వూరు, జూలై 31(ఆంధ్రజ్యోతి): అనారోగ్యానికి గురై మనస్తాపం చెంది ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుని వ్యక్తి మృతి చెందినట్లు కొవ్వూరు పట్టణ హెడ్ కానిస్టేబుల్ ఆర్.సత్యనారాయణ తెలిపారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం పట్టణంలోని క్రిస్టియన్‌పేటకు చెందిన చిగురుపాటి శ్రీనివాస్ (56) టీవీ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. భార్య ప్రియదర్శిని, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో అప్పులుచేసి వైద్యం చేయించుకున్నాడు. అనారోగ్యం కుదుటపడకపోవడంతో మనస్తాపం చెంది జూలై 30వ తేదీన రాత్రి ఇంట్లో చీరతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం లేచి చూసేసరికి ఫ్యాన్‌కు వేలాడుతున్న భర్తనుచూసి భార్య ప్రియదర్శిని పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ సత్యనారాయణ తెలిపారు.

జాతీయస్థాయి వర్క్‌షాపులో

తొండవరం విద్యార్థికి ఉత్తమ ప్రదర్శన అవార్డు

- ఉత్తమ ప్రదర్శనగా ఎంపికైన ప్రాజెక్టు



అవార్డు అందుకుంటున్న విద్యార్థి, ఉపాధ్యాయుడు

అంబాజీపేట, జూలై 31(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి విజ్ఞాన శాస్త్ర ప్రాజెక్టు ప్రజెంటేషన్, వర్క్‌షాపు 2025ను పురస్కరించుకుని నాలుగు రోజులపాటు న్యూఢిల్లీ, గలగోటియ యూనివర్సిటీ నోయిడ, ఉత్తరప్రదేశ్‌లలో నిర్వహించిన కార్యక్రమంలో అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం తొండవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థి సోము ఈశ్వరశ్రీ రామ్‌తేజ, ఉపాధ్యాయుడు కందాల గణేష్ నరసింహం పాల్గొన్నారు. మిని స్ట్రా ఆఫ్ ఎడ్యుకేషన్ ఇన్నోవేటివ్ సెల్, ఏఐసీటీయూ ద్వారా జాతీయస్థాయికి ఎంపికైన 39ప్రాజెక్టులను గలగోటి యూనివర్శిటీ నోయిడ, ఉత్తరప్రదేశ్‌లో వర్క్‌షాపు ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేంద్ర విద్యాశాఖా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, ఏఐసీటీఈ అసిస్టెంట్ డైరెక్టర్లు పాల్గొన్నారు. 2024 విద్యాసంవత్సరానికి ఆంధ్రప్రదేశ్ నుంచి ఎంపికై ప్రదర్శించబడిన తొండవరం హైస్కూల్‌కు చెందిన కార్బన్‌డైయాక్సైడ్ ఫిల్టర్ ప్రాజె క్టు సస్టైనబుల్ డవలప్‌మెంట్ విభాగం నుంచి జాతీయ ఉత్తమ ప్రదర్శనగా ఎంపికైంది. ఈ కార్బన్‌డైయాక్సైడ్ ఫిల్టర్ ప్రాజెక్టు పేటెంట్ పొందడంలో మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ తమవంతు సహకారం అందజేస్తామని తెలిపారు. అదేవిధంగా జూలై 29న న్యూఢిల్లీలో కేంద్ర విద్యాశాఖా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ముఖ్యఅతిథిగా పాల్గొన్న నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ డే సదస్సుకు మా ప్రాజెక్టు ప్రతినిధుల ద్వారా ఆహ్వానం అందడంతో పాల్గొన్నామని ఉపాధ్యాయుడు నరసింహం తెలిపారు. ఈ జాతీయస్థాయిలో పోటీలలో పాల్గొని విజయం సాధించిన విద్యార్థులకు ప్రత్యేక ఇన్నోవేషన్ కోటాలో ప్రాధాన్యం ఇస్తామని ఏఐసీ టీఈ అసిస్టెంట్ డైరెక్టర్ తెలిపారు. దీంతో ఉపాధ్యాయుడు నరసింహంతోపాటు విద్యార్థి శ్రీరామ్‌తేజను హెచ్‌ఎం కేశవాచార్యులతోపాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

దారి దోపిడీ ఘటనపై

సాగుతున్న విచారణ

- సీసీ కెమెరాల ఫుటేజీ, సెల్ టవర్ల డేటా సేకరణ
- అనుమానితులను ప్రశ్నిస్తున్న పోలీసులు



సీసీ ఫుటేజీల డేటాను పరిశీలిస్తున్న గొల్లప్రోలు ఎస్‌ఐ రామకృష్ణ తదితరులు

గొల్లప్రోలు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కాకినాడజిల్లా గొల్లప్రోలు పట్టణ శివారు చెందుర్తి రోడ్డులో జరిగిన భారీ దారి దోపిడీ ఘటనలో పోలీసుల విచారణ కొనసాగుతోంది. వారు సీసీ ఫుటేజీలు, సెల్ టవర్ల డేటాను సేకరించి విశ్లేషిస్తున్నారు. పలువురు అనుమానితులను అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. కాకినాడ ఎస్‌డీపీవో మనీష్‌దేవరాజ్ పాటిల్ ఆధ్వర్యంలో ఐదు దర్యాప్తు బృందాలు వివిధ కోణాల్లో విచారణ సాగిస్తున్నాయి. సమీర్ ప్రజావత్ ప్రయాణించినట్టు చెబుతున్న మార్గంలోని సీసీ కెమెరాలను పరిశీలించడంతో అతను చెప్పిన సమయాల్లోని డేటాను సేకరించారు. అతను తిరిగి మార్గంలోని సెల్‌టవర్ల పరిధిలో కాల్‌డేటాలను విశ్లేషిస్తున్నారు. దారి దోపిడీకి పాల్పడిన నలుగురు ఆగంతకులు ఎవరు, వీరు పాత నేరస్తులు, లేకుంటే సమీర్‌కు పరిచయం ఉన్న వారా తదితర అంశాలను పరిశీలించారు. ఇటీవల చోరీలకు పాల్పడిన వారిని పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. అయితే సమీ ర్ చెబుతున్న విషయాలకు, సీసీ కెమెరాల్లో లభించిన డేటా మధ్య పొంతన కుదరట్లేదని తెలిసింది. విచారణలో పిఠాపురం శ్రీనివాస్, గొల్లప్రోలు ఎస్‌ఐ రామకృష్ణ, సర్కిల్ పరిధిలోని ఎస్‌ఐలు పాల్గొన్నారు.

రక్షణ కల్పించండి సారూ!

- ఎస్పీని ఆశ్రయించిన ప్రేమ జంట



ఎస్పీని కలిసి బయటకు వస్తున్న ప్రేమ జంట

కాకినాడక్రైం, జూలై 31(ఆంధ్రజ్యోతి): ప్రేమించి పెళ్లి చేసుకున్న తమకు తమ కుటుంబీకుల నుంచి ప్రాణహాని ఉందని ఓ ప్రేమజంట గురువారం ఎస్పీ జి.బిందుమాధవ్‌ను ఆశ్రయించింది. ప్రేమ జంట తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కాకినాడజిల్లా కాకినాడరూరల్ మండలం సర్పవరం గ్రామానికి చెందిన యాళ్ల రమ్య, సామర్లకోట మండలం నవర గ్రామానికి చెందిన వాకపల్లి సాయిగణేష్ రెండేళ్లుగా ప్రేమించుకున్నారు. అయితే ఇరువురి పెద్దలకు ప్రేమ విషయం తెలిసిన వారి పెళ్లికి ఒప్పుకోలేదు. ఈ నేపథ్యంలో మేజర్లైన ఇద్దరూ అన్నవరం వెళ్లి సత్యనారాయణస్వామి సన్నిధిలో ఇటీవల ప్రేమ వివాహం చేసుకున్నారు. సాయి గణేష్‌పై రమ్య కుటుంబీకులు సర్పవరం పోలీస్‌స్టేషన్‌లో కిడ్నాప్ కేసు పెట్టారు. తనను సాయి గణేష్ బలవంతంగా తీసుకెళ్లలేదని, ఇద్దరం ఇష్టపూర్వకంగానే పెళ్లి చేసుకున్నామని రమ్య మీడియాకు వివరించింది. తన తల్లి, అన్నయ్య తమను చంపేందుకు ప్రణాళిక రచిస్తున్నారని, రౌడీలను పెట్టి తమ కోసం గాలిస్తున్నారని రమ్య వాపోయింది. ప్రాణాపాయం ఉండి గత్యంతరం లేని పరిస్థితుల్లో తమ ప్రాణరక్షణ కోసం ఎస్పీని ఆశ్రయించాల్సి వచ్చిందని రమ్య తెలిపింది. తమ పరిస్థితిని అర్థం చేసుకున్న ఎస్పీ సర్పవరం సీఐతో చెప్పి ఎటువంటి ఇబ్బంది కలుగకుండా చూస్తానని ఎస్పీ హామీ ఇచ్చారని ఆ ప్రేమ జంట మీడియాకు తెలిపింది.

వానపల్లిలో క్షుద్రపూజల కలకలం

- ఆరుగురిపై బైండోవర్ కేసు



వానపల్లిలో క్షుద్రపూజలకు సిద్ధం చేశారంటున్న 30 అడుగుల గొయ్యి

కొత్తపేట, జూలై 31(ఆంధ్రజ్యోతి): కొత్తపేట మండలం వానపల్లి గాంధీబొమ్మ సెంటర్ సమీపంలో ఒకఇంట్లో రహస్యంగా క్షుద్రపూజలు చేస్తున్నారన్న ఆరోపణలు కలకలంరేపింది. దీనికి సంబంధించి ఒక ఇంటి పెరటిలో 30అడుగుల లోతులో గొయ్యి తవ్వించి ప్రాంతం నుంచి ఆ ఇంటి యజమాని నలుగురు వ్యక్తులను తీసుకువచ్చి పూజలు చేయిస్తున్నాడని దీంతో గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారని పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఎస్‌ఐ జి.సురేంద్ర తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఆ ఇంటి యజమానిని ఆరా తీయగా తమ ఇంట్లో వివాహాలు జరగడంలేదని దీంతో వాస్తుదోషం ఉన్నట్లు గుర్తించి ఇంటి పెరటిలో ఓ మూలన బావి తవ్విస్తున్నామని తెలిపారు. అయితే బావి తవ్వడానికి బయట ప్రాంతం నుంచి వ్యక్తులను ఎందుకు తీసుకువచ్చారని వారి వివరాలు సేకరించి సంబంధిత ఆరుగురుపై బండోవర్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సురేంద్ర తెలిపారు.

తప్పిపోయిన బాలుడు తల్లిదండ్రులకు అప్పగింత



తప్పిపోయిన బాలుడిని అప్పగించిన ట్రాఫిక్ ఎస్‌ఐ

సామర్లకోట, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట రైల్వేస్టేషన్‌లో తప్పిపోయిన నాలుగేళ్ల బాలుడిని సామర్లకోట ట్రాఫిక్ పోలీసులు గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరానికి చెందిన కూలీ బొజ్జా ఆంజనేయులు కుటుంబం సామర్లకోట రైలు దిగి విశాఖజిల్లా దువ్వాడ వెళ్లేందుకు మరో రైలు కోసం స్టేషన్‌లో ఎదురుచూస్తోంది. ఈ తరుణంలో కుమారుడు రాము కనిపించకపోవడంతో స్టేషన్ పరిసర ప్రాంతాల్లో వెదికారు. అయినా ఆచూకీ తెలియకపోవడంతో స్టేషన్ ఎదురుగానే ఉన్న ట్రాఫిక్ ఎస్‌ఐ అడపా గరగారావుకు తెలిపారు. దీంతో ఆయన ట్రాఫిక్ పోలీసులను నలువైపులా గాలించమని ఆదేశించి సీసీ కెమెరా ల్లో ఫుటేజీలను పరిశీలించారు. జయలక్ష్మి థియేటర్ రోడ్డులో బజ్జీల బండివద్ద బాలుడు రాము ఉన్నట్లు గుర్తించి అతడిని చేరదీసి తల్లిదండ్రులకు క్షేమంగా అప్పగించారు. ట్రాఫిక్ ఎస్‌ఐ గరగారావుతోపాటు సిబ్బందికి రాము కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

గొర్రిపూడిలో తాటాకిల్లు దగ్ధం

- రూ.1.20 లక్షల ఆస్తి నష్టం

కరప, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరప మండలం గొర్రిపూడిలో బుధవారం అర్ధరాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో ఓ తాటాకిల్లు దగ్ధమై రూ.1.20 లక్షల ఆస్తి నష్టం సంభవించింది. గొర్రిపూడి శివారు మురుకోపోర ప్రాంతానికి చెందిన గండి అప్పలరాజు కుటుంబీకులతో కలిసి తాటాకింట్లో నివాసం ఉంటున్నాడు. వ్యవసాయ కూలీ అయిన అతడు కిడ్నీ వ్యాధికి డయాలసిస్ చేయించుకుంటున్నాడు. బుధవారం అర్ధరాత్రి విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో తాటాకిల్లు కాలిబూడిదైంది. ఇంట్లో ఉన్న రూ.50 వేలు నగదు, 8 క్వింటాళ్ల బియ్యం, 11కోళ్లు, రూ.20వేల విలువైన వస్తువులు, ఫర్నీచర్ అగ్నికి ఆహు తయ్యాయి. వీఆర్వో గోపాలరావు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు నమోదు చేసుకుని తహసీల్దారుకు నివేదిక అందిం చారు. బాధిత కుటుంబ సభ్యులను నీటిసంఘం అధ్యక్షుడు జోకా తాతాజీ, జనసేన నాయకులు రాంబాబు, అన్నవరం పరామర్శించి ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని చెప్పారు.

కడియపులంక సర్పంచ్ ఎన్నికకు వైసీపీ దూరం

కడియం, జూలై 31(ఆంధ్రజ్యోతి): కడియపులంక సర్పంచ్ ఎన్నికకు వైసీపీ దూరంగా ఉంటుందని, పోటీ చేయదని ఆ పార్టీ మండలాధ్యక్షుడు యాదల సతీష్‌చంద్రస్టాలిన్ తెలిపారు. గతంలో సర్పంచ్‌గా ఎన్నికైన మార్గాని అమ్మాణి ఆకస్మికంగా మృతి చెందడంతో ఆ పదవి ఖాళీ అయింది. ప్రస్తుతం ఈ నెల 10న జరుగబోయే ఎన్నికల్లో మార్గాని అమ్మాణి కుమార్తె మారిశెట్టి పద్మావతి సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా గతంలో వైసీపీ తరుపున సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేసిన ఊటుకూరి శైలజ సమక్షంలో గురువారం వైసీపీ నాయకులు సమావేశమయ్యారు. సానుభూతి దృష్ట్యా పద్మావతికి పోటీగా ఎవరూ నిలవకూడదని సమష్టిగా నిర్ణయం తీసుకున్నారు. ఈ విషయాన్ని నియోజకవర్గ ఇన్‌చార్జి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయనను దీంతో మండలాధ్యక్షుడు స్టాలిన్‌తోబాటు తాడాల చక్రవర్తి, కొత్తపల్లి నాగశివాజీ, బోడపాటి సత్యనారాయణ తదితరులు మర్యాద పూర్వకంగా కలిశారు.

నగరంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరంసిటీ, జూలై 31(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో ఎటు చూసినా అభివృద్ధి పనుల జాతర జరుగుతోందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. గురువారం స్థానిక 44వ వార్డులో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ఇప్పటి వరకు సుమారు రూ.250 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, త్వరలో సుందరమైన రాజమహేంద్రవరాన్ని ప్రజలు చూస్తారన్నారు. గత వైసీపీ పాలనలో అనాలోచితంగా జేఎన్ రోడ్డు వంటి ప్రాంతాల్లో డివైడర్లు, ఫుట్‌పాత్‌లు నిర్మించి మిగిలిన ప్రాంతాలను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని, దీని వల్ల నగర అభివృద్ధి కుంటుపడిందన్నారు. కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మద్యం కుంభకోణం నుంచి జగన్ తప్పించుకోలేడు

శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ సత్తిబాబు

రాజమహేంద్రవరం సిటీ, జూలై 31(ఆంధ్రజ్యోతి): మద్యం ముడుపుల కుంభకోణం నుంచి మాజీ సీఎం జగన్ తప్పించుకోలేరని శెట్టిబలిజ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ కుడుపూడి సత్తిబాబు అన్నారు. రాజమహేంద్రవరంలో తన కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. మద్యం ముడుపులకు సంబంధించి రూ.11 కోట్ల నగదు తాజాగా తెలంగాణలో సిట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారని, ఈ కేసులో ఇంకా చాలామంది బయటకు వస్తారన్నారు. తండ్రి హయాంలో జగన్ అధికారాన్ని అడ్డుపెట్టుకుని వేల కోట్ల అవినీతికి పాల్పడ్డాడని, అప్పట్లో అతడిపై సీబీఐ 11 కేసులు నమోదు చేసిందని గుర్తు చేశారు. సుమారు రూ.3,500 కోట్ల అంచనాతో ప్రారంభమైన ఈ స్కామ్ రూ.70వేల కోట్లకు చేరే పరిస్థితి రావడం చూస్తే జగన్ ప్రభుత్వ ఖజానాకు ఏ స్థాయిలో గండి కొట్టారో అర్థమవుతుందన్నారు.

అధ్యాపకురాలిగా లక్ష్మీనరసమ్మ విశేష సేవలు



లక్ష్మీనరసమ్మ దంపతులను సన్మానిస్తున్న రిజిస్ట్రార్ స్వామి

దివాన్‌చెరువు, జూలై31 (ఆంధ్రజ్యోతి): తెలుగు శాఖ అధ్యాపకురాలిగా లక్ష్మీనరసమ్మ విశేష సేవలు అందించారని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి కొనియాడారు. యూనివర్శిటీలో తెలుగు అధ్యాపకురాలిగా పనిచేసిన లక్ష్మీనరసమ్మ గురువారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో రిజిస్ట్రార్ ఆమె సేవలను ప్రశంసించారు. ఉద్యోగ విరమణ అనంతర జీవితం ఆయురారోగ్యాలతో సాగాలనా ఆకాంక్షించారు. లక్ష్మీనరసమ్మ దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డి.జ్యోతిర్మయి, తెలుగు అధ్యాపకులు తలారి వాసు, కేవీఎన్‌డీ వరప్రసాద్, వివిధ విభాగాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రేమ్‌చంద్ జయంతి

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల హిందీ విభాగం ఆధ్వర్యంలో గురువారం మున్షిప్రేమ్‌చంద్ జయంతి నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించి మాట్లాడుతూ ప్రేమ్ చంద్ గొప్ప నవలా చక్రవర్తి అని కొనియాడారు. గద్యంలో కథలు, నవలలు రచించి ప్రజల్లో ఉత్తేజాన్ని నింపారన్నారు. హిందీ విభాగాధిపతి ఉషారాణి మాట్లాడారు. తెలుగు, చరిత్ర విభాగాధిపతులు పీఏ సత్యనారాయణ, అంజనీకుమారి, అధ్యాపకులు నూజిల్ల శ్రీనివాస్, భవానీ, షేక్ జరీనాబేగం, బి.సుబ్బలక్ష్మి, ప్రేమకుమారి,వెంకటేశ్వర్లు, ప్రిస్కిల్లా విద్యార్థులు పాల్గొన్నారు.

కనీస పెన్షన్, హయ్యర్ పెన్షన్ కోసం చలో ఢిల్లీ

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఈపీఎఫ్ పెన్షనర్ల సమస్యల పట్ల కేంద్రంలోని ప్రధాని మోదీ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చూపుతోందని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డుపర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కె.సత్తిరాజు విమర్శించారు. గురువారం రాజమహేంద్రవరంలో అసోసియేషన్ జిల్లా సదస్సు జరిగింది. ఈ సదస్సులో సత్తిరాజు, సీఐటీయూ నాయకులు ఎస్ఎస్ మూర్తి, పూర్ణిమరాజు మాట్లాడుతూ కనీస పెన్షన్ రూ.9,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే హయ్యర్ పెన్షన్ ఇచ్చే విషయంలోనూ అన్యాయం జరుగుతోందన్నారు. పెన్షనర్ల డిమాండ్ల సాధన కోసం డిసెంబరులో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరిగే పోరాట కార్యక్రమానికి పెద్దఎత్తున తరలిరావాలని కోరారు. నాయకులు ఎస్.సోమేశ్వరరావు, సీహెచ్ ప్రసాద్, టీఎస్ ప్రభాకర్, తదితరులు మాట్లాడారు. పలువురు పాల్గొన్నారు.

ఆహార నాణ్యతకు ప్రాధాన్యమివ్వాలి

అన్న క్యాంటీన్ తనిఖీలో అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్

రాజమహేంద్రవరంసిటీ, జూలై 31(ఆంధ్రజ్యోతి): అన్న క్యాంటీన్‌లో ఆహార నాణ్యతలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా రుచిగా, శుచిగా తయారు చేయాలని నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ అన్నారు. గురువారం జీఎన్‌టీ రోడ్డులో అన్న క్యాంటీన్‌ను ఆయన తనిఖీ చేశారు. టోకెన్ కౌంటర్, డైనింగ్, సింక్ ఏరియాలను పరిశీలించారు. అక్కడ భోజనం చేస్తున్న మహిళలతో మాట్లాడి ఆహార నాణ్యతపై ఆరా తీశా రు. డస్ట్‌బిన్ వద్ద భోజన వ్యర్థాలు చిందరవందరగా ఉండడంతో అక్కడ వారికి పలు సూచనలు చేసి క్లాస్ పీకారు. ప్లాస్టిక్‌ను పూర్తిస్థాయిలో నిషేధించాలని అందుకు ప్ర జలు సహకరించాలని అడిషనల్ కమిషనర్ పిలుపునిచ్చారు.

ఉపాధ్యాయులు హ్యాండ్ బుక్స్‌ను వినియోగించాలి

బిక్కవోలు, జూలై 31(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సరఫరా చేసిన హ్యాండ్ బుక్స్‌ను ఉపాధ్యాయులందరూ వినియోగించాలని మండల విద్యాశాఖాధికారులు సీహెచ్‌వీ సత్యనారాయణ, కె.పూర్ణచంద్రరావు సూచించారు. మండలంలోని పలు పాఠశాలలను గురువారం వారిద్దరూ వేర్వేరుగా సందర్శించారు. బలభద్రపురంలోని మెయిన్, నెం.1 ప్రాథమిక పాఠశాలలను ఎంఈవో-1 సత్యనారాయణ సందర్శించి విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పరిశీలించి ఉపాధ్యాయులకు సూచనలిచ్చారు. తొస్సిపూడి, కొమరిపాలెం గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలతో పాటు, పందలపాకలోని జడ్పీ ప్లస్ పాఠశాలను ఎంఈవో-2 పూర్ణచంద్రరావు సందర్శించి ఇంటర్‌లో ప్రవేశాలపై హెచ్ఎం చిర్ల శ్రీనివాసరెడ్డిని అడిగి తెలుసుకున్నారు.

రంపయర్రంపాలెం పాఠశాలకు స్పోర్ట్స్ కిట్ అందజేత

గోకవరం, జూలై 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని రంపయర్రంపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థులు గురువారం స్పోర్ట్స్ కిట్ అందజేశారు. పూర్వ విద్యార్థులైన చిక్కం దొరబాబు, దవులూరి బ్రహ్మాజీనాయుడు విద్యార్థులకు అవసరమైన వివిధ రకాల వ్యాయామ, క్రీడా పరికరాలను కొనుగోలు చేసారు. వాటిని పాఠశాల స్టాఫ్ సెక్రటరీ పెదిరెడ్ల రాజు చేతుల మీదుగా ప్రధానోపాధ్యాయుడు కె.అబ్బులుకు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, రామకృష్ణ, వరలక్ష్మి, సుబ్బారావు, రాంబాబు, భాస్కర్, ప్రకాష్‌రావు, బాలసుబ్రహ్మణ్యం, లక్ష్మీకాంతం, సరళకుమారి, కుమారి, తదితరులు పాల్గొన్నారు.

మంచి సేవలు ఉద్యోగులకు గుర్తింపునిస్తాయి



కృపాబాయమ్మను సత్కరిస్తున్న దృశ్యం

రాజానగరం, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు చేసిన సేవలే జీవితంలో గుర్తింపునిస్తాయని రాజానగరం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ గట్టి రామభాస్కర్ అన్నారు. పీహెచ్‌సీలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌గా విశేష వైద్య సేవలందించి పదవీ విరమణ పొందిన సీహెచ్ కృపాబాయమ్మను వైద్య సిబ్బంది గురువారం సత్కరించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సభలో డాక్టర్ రామభాస్కర్ మాట్లాడుతూ వైద్య ఆరోగ్యశాఖలో 1985లో ఆరోగ్య కార్యకర్తగా బాధ్యతలు చేపట్టి నాలుగు దశాబ్దాల పాటు అనేక మందికి వైద్య సేవలందించారన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, తోటి ఉద్యోగులు పాల్గొని కృపాబాయమ్మను ఘనంగా సత్కరించారు.

నిర్మించి రెండేళ్లయింది.. ఇప్పటికీ తెరుచుకోలేదు..

జంబుపట్నంలో నిరూపయోగంగా రైతు సేవా కేంద్రం





జంబుపట్నంలో నిరూపయోగంగా ఉన్న రైతు సేవా కేంద్ర భవనం

కోరుకొండ, జూలై 31(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖాధికారుల నిర్లక్ష్యం, కింది స్థాయి సిబ్బంది అలసత్వం వెరసి రైతుల పాలిట శాపంగా మారింది. కోరుకొండ మండలం జంబుపట్నం గ్రామంలో సుమారు రూ.22 లక్షలు వెచ్చించి నిర్మించిన రైతు భరోసా కేంద్రం(ప్రస్తుతం రైతు సేవవా కేంద్రం) నిర్మించి ప్రారంభించి రెండు సంవత్సరాలు కావస్తున్నా దాని తాళం నేటికీ తెరుచుకోలేదు. ఈ రైతు భరోసా కేంద్రాన్ని 2023 మే 6న ప్రారంభించారు. అయితే అప్పటి నుంచి ఇప్పటి వరకు ఈ రైతు భరోసా కేంద్రానికి వేసిన తాళం మాత్రం తీయకపోవడం పలు విమర్శలకు తావిస్తుంది. వ్యవసాయ సీజన్ ప్రారంభమై రెండు నెలలు కావస్తున్నా ఈ రైతు సేవా కేంద్రంలో కనీసం తలుపులు తీసిన పాపాన పోలేదు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందించడం, రైతులకు అవసరమైన శిక్షణా తరగతులు నిర్వహించడం, రైతుల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించడం కోసం కోట్లాది రూపాయలు వెచ్చించి గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు నిర్మించారు.మండలంలో అన్నింటి కన్నా ఆలస్యంగా ప్రారంభమైన ఈ రైతు భరోసా కేంద్రం ప్రారంభించి రెండేళ్లయినా రైతులకు సేవలు అందించడంలో పూర్తిగా విఫలమైంది. మండలంలోని అన్ని గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు తెరిచి ఉంచుతున్నారా లేదా చూడాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో ఈ రైతు భరోసా కేంద్రం రైతులకు ఎలాంటి సేవలు అందించలేకపోతోంది. కోట్లాది రూపాయల ప్రజా ధనం వృథా చేశారే తప్ప రైతులకు ఎక్కడా భరోసా కల్పించడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు కలుగజేసుకుని ఈ రైతు భరోసా కేంద్రం తాళాలు తీయించి అందుబాటులోకి తీసుకురావాలని రైతాంగం కోరుతోంది.

నర్సింగ్ పట్టభద్రులకు జర్మనీలో ఉపాధి అవకాశం

జిల్లా సాంఘిక సంక్షేమ, సాధికారత శాఖ అధికారి ఎండీ ఘయాజుద్దీన్

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన ఎస్సీ ఎస్టీ కులాల నర్సింగ్ పట్టభద్రులకు జర్మనీ భాషలో బీ2 స్థాయి కోసం ఉచిత శిక్షణతోపాటు జర్మనీ దేశంలో ఉపాధి కల్పించనున్నట్టు జిల్లా సాంఘిక సంక్షేమ, సాధికారత శాఖ అధికారి ఎండీ ఘయాజుద్దీన్ తెలిపారు. ఈమేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. బీఎస్సీ నర్సింగ్ లేదా జీఎన్ఎం ఉత్తీర్ణులై ఉండి 35 ఏళ్లలోపు వయస్సు ఉన్న వారు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని తెలిపారు. అలాగే జీఎన్ఎంలు మూడేళ్లు, బీఎస్సీ నర్సింగ్ అయితే రెండేళ్ల నర్సింగ్ క్లినికల్ వృత్తిలో అనుభవం కల్గి ఉండాలన్నారు. ఆసక్తి ఉన్న వారు ఆగస్టు 6వ తేదీలోగా నైపుణ్యం.ఏపీ.జీవోవీ.ఇన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఎంపికైన వారికి 8 నుంచి 10 నెలల వరకూ భోజనం, ఉచిత వసతి కల్పించి శిక్షణ ఇస్తారన్నారు. వీసా, విమాన చార్జీలు, బీ2 పరీక్ష రుసుం అభ్యర్థులే చెల్లించాలని తెలిపారు. విశాఖపట్నం, గుంటూరు, తిరుపతిలో మాత్రమే శిక్షణ కార్యక్రమం ఉంటుందన్నారు. శిక్షణ అనంతరం అర్హులైన ఎంపికైన విద్యార్థులకు నెలకు రూ.2.4 లక్షల నుంచి, రూ.3.10 లక్షల వరకూ వేతనంతో కూడిన ఉపాధి జర్మనీలో కల్పించనున్నట్టు చెప్పారు. పూర్తి వివరాలకు మొబైల్ 99488 68862, 83400 94688 నెంబర్లలో సంప్రదించాలని ఘయాజుద్దీన్ పేర్కొన్నారు.

గర్భిణులకు సామూహిక సీమంతాలు



సీమంత వేడుకల్లో గర్భిణులు

రాజానగరం, జూలై 31(ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్స్ ఆధ్వర్యంలో రాజానగరంలోని మాధవి ఫంక్షన్ హాల్లో గురువారం నిర్వహించిన సామూహిక సీమంత వేడుకలు పండగ వాతావరణంలో శాస్త్రోక్తంగా జరిగాయి. దీనిలో భాగంగా గర్భిణులకు హార్లిక్స్, డ్రైఫ్రూట్స్, పప్పు దినుసులు, పలు రకాలైన పండ్లు, చీర, గాజులు, పువ్వులు, తదితర పౌష్టికాహారంతో కూడిన కిట్లను ఉచితంగా అందజేశారు. అలాగే ప్రసూతి వైద్య నిపుణులతో గర్భిణులు తీసుకోవల్సిన జాగ్రత్తలు, ఆహార పదార్థాలపై అవగాహన కలిగించారు. సుమారు 250 మంది గర్భిణులతో పాటు వారి వెంట సహాయకులుగా వచ్చిన వారితో కలిపి దాదాపు 3 వేల మంది ఈకార్యక్రమానికి హాజరయ్యారు. రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ మండవిల్లి వెంకన్నబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, జనసేన పార్టీ నా సేన కోసం నావంతు కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి, రోటరీ క్లబ్ జిల్లా 3020 గవర్నర్ వై.కళ్యాణ చక్రవర్తి, తీగెల రాజా, మద్దూరి శంకర్, వెంకట్, రఘునాధరాజు, నవీన్, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

డెంగ్యూ నివారణకు సమష్టి కృషి



కడియంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం కల్చరల్: జిల్లా కమ్యూనిటీ పారామెడికల్స్ అండ్ ప్రైమరీ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాజమండ్రి కంబాలపేట అర్బన్ హెల్త్ సెంటర్ నుంచి సుబ్బారావుపేట తదితర ప్రాంతాల్లో ర్యాలీని నిర్వహించి డెంగ్యూ నివారణపై అవగాహన కలిగించారు. వైద్యాధికారి డాక్టర్ కృష్ణ అనూహ్య మాట్లాడుతూ ఇల్లు, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటి తొట్టెలు, ట్యాంకులు, సంపులపై మూతలు ఉంచుకోవాలని సూచించారు. పీఎంపీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తోరాటి ప్రభాకరరావు మాట్లాడుతూ ఎవరికైనా డెంగ్యూ లక్షణాలైన తీవ్రమైన జ్వరం, తలనొప్పి, కీళ్లు, కండరాల నొప్పులు, వణుకు బలహీనత, చర్మంపై ఎర్రటి దద్దుర్లు కనిపిస్తే దగ్గరలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో యూపీహెచ్‌సీ చైర్మన్ ఏవీ శ్రీనివాస్, బళ్లా శ్రీనివాసరావు పి.దేవానందం, పి.చిన్ని, రహమాన్ ఖాన్, మట్టా రమేష్, జక్కంపూడి అర్జున్ పాల్గొన్నారు.

కడియం, జూలై 31(ఆంధ్రజ్యోతి): జాతీయ డెంగ్యూ మాసోత్సవం సందర్భంగా గురువారం కడియం మండల గ్రామీణ వైద్యుల ఆధ్వర్యంలో డెంగ్యూపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రజలకు అవగాహన కల్పించారు. ర్యాలీని కడియం ఉపసర్పంచ్ వెలుగుబంటి రఘురామ్(నాని) ప్రారంభించి మాట్లాడారు. డెంగ్యూ పట్ల అవగాహన పొంది లక్షణాలు కనిపిస్తే పీహెచ్‌సీకి వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామీణ వైద్యుల సంఘం నాయకులు పి.దేవానంద్, ఎం.మధుసూదనరెడ్డి, వి.రవి, పి.రాజ్‌కుమార్, కె.శర్మ, కామరాజు, ఎస్‌డీవీ ప్రసాద్, యు.ప్రసాద్‌బాబు పాల్గొన్నారు.

హిందీ గాయకుడు మహమ్మద్ రఫీ జయంతి

రాజమహేంద్రవరం కల్చరల్, జూలై 31(ఆంధ్రజ్యోతి): స్థానిక గోకవరం బస్టాండ్ సమీపంలోని జిత్ మోహన్‌మిత్ర కళావేదికపై నట గాయకుడు జిత్ మోహన్ మిత్ర అధ్యక్షతన గురువారం హిందీ గాయకుడు మహమ్మద్ రఫీ 46వ వర్ధంతి సభ నిర్వహించారు. రఫీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిత్ మోహన్ మిత్ర మాట్లాడుతూ, మహమ్మద్ రఫీ తన మధురమైన గానంతో పలు భాషల్లో పాటలు పాడి భారతీయ చలనచిత్ర పరిశ్రమలో చెరగని ముద్ర వేశారన్నారు. ఈ సందర్భంగా విశాఖపట్నానికి చెందిన గాయకుడు గణపతిభొట్ల రామనారాయణకు మహమ్మద్ రఫీ పురస్కారం అందజేసి ఘనంగా సత్కరించారు. జిత్ మోహన్‌మిత్ర ఆర్కెస్ట్రా గాయనీ గాయకుడు శ్రీపాద మిత్ర, వంక బాలకృష్ణ, విశ్వనాథ్, హరి, సూర్యకుమారి, జి.రామానాయుడు, నళినీ రమేష్, గిరజాల సోమరాజు నాయుడు మహమ్మద్ రఫీ పాటలు పాడి, స్వర నివాళులర్పించారు.

రైతుల ఖాతాల యాక్టివేషన్‌కు చర్యలు తీసుకోవాలి: ఆర్డీవో



కడియం, జూలై 31(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో ఎన్‌పీసీఐ ఫార్మర్ యాక్టివేషన్‌కు సంబంధించి కెనరా బ్యాంక్‌లో రైతుల ఖాతాలు యాక్టివేట్ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని రాజమహేంద్రవరం ఆర్డీవో కృష్ణనాయక్ బ్యాంక్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు కెనరా బ్యాంక్‌లోని రైతుల వివరాలను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా బ్యాంకు అధికారులకు పలు సూచనలు చేసి రైతుల బ్యాంకు ఖాతాల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి యాక్టివేట్ చేయాలని ఆర్డీవో కృష్ణనాయక్ ఆదేశించారు.

గురుకుల విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు

అనపర్తి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని రామవరం పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ మీనాక్షి అన్నారు. శుక్రవారం అనపర్తి శివారు కొత్తూరులోని బీఆర్ అంబేడ్కర్ గురుకల కళాశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యులు హాస్టల్ పరిసరాలను పరిశీలించి వ్యక్తిగత ఆరోగ్యంపై విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వెల్ఫేర్ ఆఫీసర్ ఎం.రవికుమార్, ఎంపీహెచ్ఈవో శ్రీనివాస్, హెచ్‌వీ శెట్టి లక్ష్మి, సునీత, డేవిడ్ మౌనిక పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

రాజానగరం, జూలై 31(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎస్.ఐ వెంకట నాగార్జున సూచించారు. రాజానగరం హైస్కూల్లోని విద్యార్థులకు గురవారం పలు అంశాలపై నార్త్ జోన్ టీంతో కలిసి అవగాహన కల్పించారు. శక్తి యాప్, సైబర్ క్రైమ్, మాదక ద్రవ్యాలు, ఫోక్స్ చట్టం, గుడ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించారు.

నేడు అనపర్తిలో మంత్రి నిమ్మల పర్యటన

అనపర్తి, జూలై 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామనాయుడు శుక్రవారం అనపర్తిలో పర్యటించనున్నారు. ఉదయం 9.30గంటలకు మండలంలోని దుప్పలపూడి చేరుకుని స్థానిక ఆర్‌వీఆర్ కన్వెన్షన్ హాలులో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డితో కలిసి పాల్గొంటారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్, మూలారెడ్డి విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం 12గంటలకు పాలకొల్లులోని ఆయన నివాసానికి బయలుదేరుతారు.

సీనియర్ సిటిజన్స్ సమావేశం

రాజమహేంద్రవరం కల్చరల్, జూలై 31(ఆంధ్రజ్యోతి): సీనియర్ సిటిజన్స్ ప్రజా సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో సమావేశం స్థానిక ఆర్యాపురం డాక్టర్ ఏబీ నాగేశ్వరరావు పార్కులో ఉన్న సీనియర్ సిటిజన్స్ డే కేర్ భవనంలో గురువారం జరిగింది. అశోక్‌కుమార్ జైన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి శ్రీకర హాస్పిటల్ డాక్టర్ రోహిత్‌కుమార్ ముఖ్య అతిథిగా విచ్చేసి సీనియర్ సిటిజన్స్ వయసు రీత్యా తీసుకోవలసిన పలు జాగ్రత్తలను వివరించారు.

కూటమి పాలనలో వేగంగా రాష్ట్రాభివృద్ధి

రుడా చైర్మన్ బీవీఆర్ చౌదరి.. హౌసింగ్‌బోర్డు కాలనీలో సుపరిపాలనలో తొలి అడుగు



కాలనీలో ప్రజలతో మాట్లాడుతున్న బీవీఆర్ చౌదరి

దివాన్‌చెరువు, జూలై 31(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రాభివృద్ధి వేగంగా జరుగుతోందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా రాజానగరం మండలం హౌసింగ్‌బోర్డు కాలనీలో గురువారం ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల కరపత్రాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే రాష్ట్రానికి ఎన్నో పరిశ్రమలు రావడంతో బాటు వివిధ ప్రాజెక్టు పనులు వేగంగా జరగడంతో బాటు వస్తున్నాయన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ బత్తుల నాగేశ్వరరావు (నాగు), నాయకులు రాయుడు శ్రీనివాస్, గంగిశెట్టి చంటిబాబు, అట్ల రాజేష్, సంగీత సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బిక్కవోలు, జూలై 31(ఆంధ్ర జ్యోతి): మండలంలోని బిక్కవోలు, పందలపాక గ్రామాల్లోని 11కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ల వార్షిక మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ట్రాన్స్‌కో ఇన్‌చార్జి ఈఈ జేపీబీ నటరాజన్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా బిక్కవోలు, ఊలపల్లి, కొంకుదురు, మెళ్లూరు, ఆరికరేవుల, బలభద్రపురం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామని, అలాగే మెళ్లూరు, బిక్కవోలు గ్రామాల్లోని వ్యవసాయ బోర్లకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు.

గోకవరం: మండలంలోని తంటికొండ విద్యుత్ సబ్‌స్టేషన్‌తో పాటు పలు లైన్ల మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు మండలంలోని తంటికొండ, గాదెలపాలెం, గోపాలపురం, గరగలపాలెం, అచ్చియ్యపాలెం, ఇటికాయిలపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ట్రాన్స్‌కో ఈఈ జేపీబీ నటరాజన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

అనపర్తి: మండలంలోని దుప్పలపూడి సబ్ స్టేషన్ పరిధిలోని 11కెవీ ఫీడర్ మరమ్మతుల నిమిత్తం అనపర్తిలోని ఇందిరా నగర్, జీబీఆర్ కాలేజి ఏరియా, సునందపేట, రైల్వే స్టేషన్ ఏరియాలలో శుక్రవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ట్రాన్స్‌కో ఈఈ జేపీబీ నటరాజన్ తెలిపారు.

జిల్లాలో శక్తివంతమైన బీజేపీ నిర్మాణం

నూతన పదాధికారుల సమావేశంలో జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శక్తివంతమైన బీజేపీ పార్టీ నిర్మాణం కోసం నూతన పదాధికారులు అందరూ సంకల్పంతో కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర అన్నారు. గురువారం రాజమహేంద్రవరంలోని జిల్లా బీజేపీ కార్యాలయంలో జిల్లా నూతన పదాధికారులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర మాట్లాడుతూ పదాధికారులు చేయాల్సిన విధులు, బాధ్యతల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లాకు చెందిన నూతన పదాధికారులు పాల్గొన్నారు.

సత్యదేవా నర్సరీని సందర్శించిన ఉద్యాన బృందం



కడియం, జూలై 31(ఆంధ్రజ్యోతి): కడియపులంక పుల్లా చంటియ్య - సత్యదేవా నర్సరీని గురువారం రాష్ట్ర ఉద్యానశాఖ డైరెక్టర్ కె శ్రీనివాసులు సందర్శించారు. నర్సరీ రైతు పుల్లా పెదసత్యనారాయణ ఆయననకు మొక్కను అందచేసి స్వాగతించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ నర్సరీ రైతులకు ప్రభుత్వం ద్వారా తగిన ప్రోత్సాహం అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ హార్టికల్చర్ డైరెక్టర్ బి.గోవిందరాజు, కొవ్వూరు పరిశోధన క్షేత్రం ప్రిన్సిపాల్ పి.లలిత కుమారేశ్వరి, సీనియర్ శాస్త్రవేత్తలు రవీంద్రకుమార్, వి.శివకుమార్, ఏపీఎంఐపీ పీడీ ఎ.దుర్గేష్, జిల్లా ఉద్యానశాఖ అధికారి ఎన్.మల్లికార్జునరావు, కడియం ఉద్యాన అధికారి పి.లావణ్య స్థానిక నర్సరీ రైతులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

శుక్రవారం 1 ఆగస్టు 2025 | 5

ఈనెల 6న 573.66 క్వింటాళ్ల రేషన్ బియ్యం వేలం

- జేసీ చిన్నరాముడు వెల్లడి

రాజమహేంద్రవరం అర్బన్, జూలై31(ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిధిలో నిత్యావసర వస్తువుల చట్టం కింద 6ఏ కేసుల్లో స్వాధీనం చేసుకున్న 573.66 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని (ప్రజాపంపిణీ) ఆగస్టు 6వ తేదీన ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం వేయడం జరుగుతుందని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బియ్యం వేలంలో పాల్గొనేవారు ముందురోజైన 5వ తేదీన కలెక్టరేట్‌లోని జిల్లా పౌరసరఫరాల అధికారి కార్యాలయంలో ఉన్న శాంపిల్ పీడీఎస్ బియ్యాన్ని పరిశీలించుకోవచ్చని తెలిపారు. అలాగే వేలం నిర్వహించే రోజున ఉదయం 11 గంటల లోపు ధరావత్తు కింద రూ.50 వేలను జిల్లా పౌరసరఫరాల అధికారి వారికి చెల్లించి నిర్ణీత నమూనాలో దరఖాస్తులను సమర్పించి వేలంలో పాల్గొనవచ్చని ఆయన తెలిపారు. వేలంపాటలో పాల్గొనేవారు తప్పనిసరిగా తమ జీఎస్‌టీ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ కాపీని, ధరావత్తు సొమ్ముతోపాటు సమర్పించాలని కోరారు. అయితే గతంలో 6ఏ కేసులు నమోదై పెండింగ్‌లో ఉన్న వారు వేలంపాటలో పాల్గొనేందుకు అనర్హులని జేసీ పేర్కొన్నారు.

పెరిగిన ఎన్టీఆర్ భరోసా పింఛన్లు

- నేడు పంపిణీ
- జిల్లాలో 2,36,331 మందికి రూ.103. 26 కోట్లు పంపిణీ
- కొత్తగా స్పౌజ్ పింఛన్లు 3801

రాజమహేంద్రవరం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ప్రతీ నెలా మాదిరిగా ఈనెల 1వ తేదీన కూడా ఎన్టీఆర్ సామాజిక భద్రత పింఛన్ల పంపిణీకి ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. కొత్తగా స్పౌజ్ పింఛన్ల కింద 3,801మంది ఎంపికయ్యారని, వారికి కూడా పంపిణీ చేస్తున్నామన్నారు. జిల్లాలో 2,36,331 మందికి రూ. 103 కోట్ల 26 లక్షల 21 వేల 500 పింఛన్ సొమ్ము పంపిణీ చేస్తున్నామన్నారు. శుక్రవారం ఉదయం 6.30 గంటల నుంచి అన్ని సచివాలయాల పరిధిలోనూ ఈ పంపిణీ మొదలవుతుందన్నారు. ఇప్పటికే ఆయా బ్యాంక్‌ల నుంచి డబ్బు డ్రా చేసి, పంపిణీ చేసే ఉద్యోగులకు అందజేసినట్టు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల మేరకు భర్త చనిపోయిన భార్యలకు స్పౌజ్ పింఛన్ కింద జిల్లాలో 3801 మందికి రూ.1.52 కోట్లు పంపిణీ చేయనున్నామన్నారు. జిల్లాలో వృద్ధాప్య పింఛన్లు 1,11,424 ఉండగా వారికి రూ. 45.56 కోట్లు, 66,612 మందికి రూ.28.35 కోట్లు, దివ్యాంగులు 31,892 మందికి రూ.6 వేలు వంతున రూ.19.47కోట్లు, బెడ్‌రిడెన్ ఆరోగ్య పింఛన్ కింద రూ.15 వేల వంతున 1,089 మందికి రూ.1.63 కోట్లు, పంపిణీ చేస్తున్నామని చెప్పారు. కిడ్నీ, తలసేమియా, హార్ట్ ట్రాన్స్‌ప్లాంట్ బాధితులకు రూ.10 వేల వంతున 700 మందికి రూ. 70 లక్షలు, అభయహస్తం కింద రూ. 500 వంతున 5,782 మందికి రూ.29.92 లక్షలు అందజేయనున్నట్టు చెప్పారు.

రేపు రైతుల ఖాతాల్లో అన్నదాత సుఖీభవ సొమ్ములు జమ

రైతులందరూ ఈకేవైసీ తప్పసరిగా చేయించుకోవాలి : జిల్లా కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం రూరల్, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఆగస్టు 3వ తేదీన అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ యోజన పథకం కింద రూ.7 వేల చొప్పున అర్హులైన రైతుల ఖాతాల్లో నేరుగా జమ అవుతుందని జిల్లా కలెక్టర్ ప్రశాంతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్నదాత సుఖీభవ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం 1,13,000 మంది రైతులకు రూ.55 కోట్లు, పీఎం కిసాన్ యోజన పథకం కింద 1,20,000 మంది రైతులకు రూ.24 కోట్లు.. మొత్తం రూ.79కోట్లు జమవుతుందన్నారు. ఇక నిధులు సకాలంలో అందేందుకు, రైతుల బ్యాంక్ ఖాతాలు ఎన్‌పీసీఐ (నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా)తో అనుసంధానమై ఉండాలన్నారు. జిల్లాలో 1434 ఖాతాలు ఎన్‌పీసీఐతో అనుసంధానం కాలేదన్నారు. మరో 1072 ఖాతాలు అనుసంధానమైనా ఇన్ ఏక్టివ్‌లో ఉన్నాయన్నారు. రైతులు ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు. అర్హత కలిగిన రైతులందరికీ అన్నదాత సుఖీభవ సొమ్ములు జమవుతాయని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరంలేదన్నారు. ఏవైనా సందేహాలుంటే రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలని, లేదా సమీకృత కాల్ సెంటర్ 155251, వాట్సాప్ గ్రూప్ నంబరు 9552300003కు కాల్ చేయవచ్చని తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ కులాల నర్సింగ్ పట్టభద్రులకు జర్మనీలో ఉపాధి అవకాశం

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన ఎస్సీ, ఎస్టీ కులాల నర్సింగ్ పట్టభద్రులకు జర్మనీ భాషలో బీ2 స్థాయి కోసం ఉచిత శిక్షణతోపాటు జర్మనీ దేశంలో ఉపాధి కల్పించడం జరుగుతుందని జిల్లా సాంఘిక సంక్షేమ, సాధికారత శాఖ అధికారి ఎండీ షయాజుద్దీన్ తెలిపారు. ఈమేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేస్తూ ఆసక్తి కల్గి దరఖాస్తు చేసుకునే వారు 35 ఏళ్లలోపు వయస్సు కల్గి ఉండాలని, బీఎస్సీ నర్సింగ్ లేదా జీఎన్ఎం ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. అలాగే జీఎన్ఎంలు మూడు ఏళ్లు, బీఎస్సీ నర్సింగ్ అయితే రెండేళ్ల నర్సింగ్ క్లినికల్ వృత్తిలో అనుభవం కల్గి ఉండాలని తెలిపారు. ఆసక్తి కల్గినవారు ఆగస్టు 6వ తేదీలోగా నైపుణ్యం.ఏపీ.జీఓవీ.ఇన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఎంపికైన వారికి 8 నుంచి పది నెలల వరకూ ఉచిత వసతి, భోజన సదుపాయాలు కల్పించి శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, వీసా, విమాన ఛార్జీలు, బీ2 పరీక్ష రుసుం సంబంధిత విద్యార్థినీ విద్యార్థులు చెల్లించాలని తెలిపారు. విశాఖపట్నం, గుంటూరు, తిరుపతిలో మాత్రమే శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. శిక్షణ అనంతరం ఎంపికైన విద్యార్థులకు నెలకు రూ. 2.4 లక్షల నుంచి, రూ.3.10 లక్షల వరకూ వేతనంతో కూడిన ఉపాధి జర్మనీలో కల్పించడం జరుగుతుందని తెలిపారు. పూర్తి వివరాలకు మొబైల్ 9948868862, 8340094688 నెంబర్లలో తమను సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

'రేషన్ డీలర్లపై ఒత్తిడి తగ్గించాలి'

8



బస్సుల్లో సదుపాయాలు పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

ప్రయాణం.. సాఫ్రీగా..





ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ
A000852 29 Jul 2025 14:37:40
B025/1 EXPRESS WFT TKT
స్త్రీ శక్తి
VJA - TVR
SEAT NO 13
A 1 x 120.00 = ₹120.00
మొత్తం టిక్కెట్ ధర : ₹ 120.00
ప్రభుత్వ రాయితీ : ₹ 120.00
చెల్లించవలసింది : ₹ 0.00
DRI NO:370800 COND NO:-----
KMs:84 EPOS:0524001079

- మహిళలకు ఉచిత బస్సు ప్రయాణానికి ఉమ్మడి జిల్లాలో ముమ్మర ఏర్పాట్లు
- రాష్ట్రవ్యాప్తంగా ఆగస్టు 15 నుంచి ఉచిత బస్సుల్లో తిరగడానికి ప్రభుత్వం పచ్చజెండా
- జీరో ఫేర్ టికెట్‌ను గురువారం ప్రయోగాత్మకంగా విడుదల చేసిన ఆర్టీసీ
- టికెట్ జారీపై ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కండక్టర్లు, డ్రైవర్లకు శిక్షణ ప్రారంభం
- 11 డిపోల పరిధిలో టిమ్ యంత్రాల్లోను సాఫ్ట్‌వేర్ మార్పు పూర్తి
- పథకం అమల్లోకి వస్తే ఉమ్మడి జిల్లాలో 38 లక్షల మంది మహిళలకు ప్రయోజనం

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణానికి ఉమ్మడి జిల్లాలో శరవేగంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆగస్టు 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన అయిదు రకాల బస్సుల్లో మహిళలు ఫ్రీగా ప్రయాణించేందుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఫ్రీ ప్రయాణానికి జారీ చేసే జీరో ఫేర్ టికెట్‌ను గురువారం ప్రభుత్వం విడుదల చేసింది. ఉచిత ప్రయాణం అమల్లోకి వచ్చిన తర్వాత టికెట్లు ఏవిధంగా జారీ చేయాలనేదానిపై ఉమ్మడి జిల్లాలోని 11 డిపోల్లో కండక్టర్లు, డ్రైవర్లకు ఆర్టీసీ అధికారులు గురువారం నుంచి శిక్షణ కూడా ప్రారంభించారు.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

వైసీపీ ప్రభుత్వ అయిదేళ్ల పాలనలో అడ్డగోలుగా ఆర్టీసీ చార్జీలను పెంచేసి పేదల నడ్డి విరగ్గొట్టింది. కొద్దిపాటి దూరానికే షాక్‌కొట్టే చార్జీలు వసూలు చేసింది. అటు బయట పెట్రోలు, డీజిల్ ధరలు పెరగడంతో ప్రయాణం నరకప్రాయంగా మారింది. దీంతో ఇంటిని నడిపే ఇల్లాలి సంక్షేమం కోసం ఎన్నికలకు ముందు టీడీపీ ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని ప్రకటించింది. కూటమిని గెలిపిస్తే జిల్లాలో ఎక్కడ్నించి ఎక్కడికైనా ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేలా పథకం అమలుచేస్తామని హామీనిచ్చింది. ఈనేపథ్యంలో ఈ పథకాన్ని ఈనెల 15 నుంచి అమలు చేయనున్నట్టు ప్రభుత్వం ఇటీవల ప్రకటించింది. అయితే ఫ్రీబస్సు ప్రయాణం విభజిత జిల్లాకే పరిమితమా.. లేదా ఉమ్మడి జిల్లా వరకు అనుమతిస్తారా? అనే చర్చ జరుగుతున్న తరుణంలో ఏకంగా ప్రభుత్వం మహిళలకు బంపర్ ఆఫర్ ప్రకటించింది. ఉమ్మడి జిల్లా స్థానంలో ఏకంగా రాష్ట్రవ్యాప్తంగా ఉచితంగా మహిళలకు బస్సు ప్రయాణం చేయవచ్చని ప్రకటించింది. పల్లె వెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణించవచ్చని ఆర్టీసీ ఎండీ ద్వారకాతిరుమలరావు బుధవారం అధికారికంగా ధ్రువీకరించారు. ఈనేపథ్యంలో మరో రెండు వారాల్లో అమలుకానున్న ఈ పథకానికి గురువారం నుంచి ఉమ్మడి జిల్లాలోని 11ఆర్టీసీ డిపోల్లో అధికారులు ఏర్పాట్లు ముమ్మరం చేస్తున్నారు. ప్రధానంగా ఫ్రీబస్‌కు సంబంధించి జీరో ఫేర్ టికెట్ జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అంటే ఫ్రీ బస్సు ఎక్కిన మహిళలకు ప్రభుత్వం టికెట్ ఇస్తుంది. కానీ డబ్బులు చెల్లించక్కర్లేదు. టికెట్‌లో మాత్రం ప్రయాణిస్తున్న దూరానికి చార్జీ ఎంత అని కనిపిస్తుంది. అందులోనే ఆ మొత్తం రాష్ట్రప్రభుత్వ రాయితీగా చూపించి, చెల్లించాల్సిన చార్జీ సున్నాగా టికెట్‌లో ఉంటుంది. తద్వారా అసలు ఈ పథకం కింద ఎంతమంది మహిళలు ప్రయాణిస్తున్నారు? అనేది తెలుసుకోవడానికి వీలుగా ఈ టికెట్‌ను ఆర్టీసీ జారీచేయనుంది. దీనికి సంబంధించి గురువారం నమూనా టికెట్‌ను ఆర్టీసీ తొలిసారిగా విడుదల చేసింది. అయితే పథకం అమలయ్యాక జీరో ఫేర్ టికెట్ ఏవిధంగా కొట్టాలి? అనే దానిపై గురువారం నుంచి ఉమ్మడి జిల్లాలోని 11 డిపోల్లోని కండక్టర్లు, డ్రైవర్లకు ఆర్టీసీ అధికారులు శిక్షణ ప్రారంభించారు. అలాగే ఆయా డిపోల్లోని టికెట్ జారీ యంత్రాల(టిమ్) సాఫ్ట్‌వేర్‌ను సైతం మార్చే ప్రక్రియ పూర్తయింది. అలాగే పథకం అమలైన తర్వాత బస్సుల్లో మహిళా ప్రయాణికుల రద్దీ భారీగా పెరగనుంది. ఈ క్రమంలో మహిళా ప్రయాణికుల పట్ల ఏవిధంగా ప్రవర్తించాలి, ఘర్షణ పడకుండా ఏ విధంగా సంయమనం పాటించాలనే అంశాలపై అన్ని డిపోల్లోని 2,100 మంది సిబ్బందికి శిక్షణ ప్రారంభించారు.

అన్నీ ముస్తాబు..

ఉమ్మడి జిల్లాలో 11 ఆర్టీసీ డిపోల పరిధిలో మొత్తం 876 బస్సులున్నాయి. ఇందులో 532 పల్లెవెలుగు, అల్ట్రాపల్లెవెలుగు బస్సులు ఉన్నాయి. జిల్లాల వారీగా చూస్తే కాకినాడ జిల్లాలో 291 బస్సులుండగా, అందులో పల్లె వెలుగు, అల్ట్రాపల్లె వెలుగు 191, కోనసీమలో 300 బస్సులకు 176 పల్లెవెలుగు, తూర్పుగోదావరిలో 285బస్సులకు పల్లె వెలుగు, అల్ట్రాపల్లె వెలుగు ఉన్నాయి. అటు ఎక్స్‌ప్రెస్ బస్సులు వంద వరకు ఉన్నాయి. వీటన్నింటిలోనూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలుకానుంది. అయితే పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు ఉమ్మడి జిల్లా పరిధిలో తిరుగుతుండగా, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులు రాష్ట్రవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో తిరుగుతున్నాయి. వీటిలో మహిళలు ఉచితంగా ఎక్కడికైనా ప్రయాణించొచ్చు. పథకం అమలయ్యాక బస్సుల్లో రద్దీ పెరిగి లోడ్ ఎక్కువవుతుందని గుర్తించిన అధికారులు ఆయా బస్సుల్లో మార్పులు చేశారు. ఇప్పటికే డిపోల్లో ఈ ప్రక్రియ చివరకు వచ్చింది. కాగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఉచిత బస్సు ప్రయాణం 38 లక్షల మంది మహిళలకు ప్రయోజనం చేకూర్చనుంది. అయితే పథకం అమలయ్యాక డిమాండ్ మేరకు ఎక్స్‌ప్రెస్, మెట్రో బస్సుల సంఖ్యను పెంచే అవకాశం ఉంది.

8 మంది వేద పాఠశాల విద్యార్థులకు అస్వస్థత

- గొంతు నొప్పి, కడుపు నొప్పితో ఇబ్బందులు
- అన్నవరం దేవస్థానం ఆస్పత్రిలో ప్రాథమిక వైద్యం
- మెరుగైన వైద్యం కోసం తుని ఏరియా ఆస్పత్రికి తరలింపు

అన్నవరం/తునిరూరల్, జూలై 31(ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్మార్త ఆగమ పాఠశాల విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. 8 మంది విద్యార్థుల పరిస్థితి విషమంగా ఉండడంతో వీరిని దేవస్థానం ఆస్పత్రికి తరలించి చికిత్స అందించి అక్కడి నుంచి మెరుగైన వైద్యంకోసం తుని ఏరియా ఆస్పత్రికి తరలించారు. 8 మంది విద్యార్థులను ఎమర్జెన్సీవార్డుకు తరలించి ఏరియా ఆస్పత్రి వైద్యులు వైద్యచికిత్స అందిస్తున్నారు. విషయం తెలుసుకున్న కాకినాడ డీఎంహెచ్‌వో తుని ఏరియా ఆస్పత్రికి వచ్చి మెరుగైన వైద్యసేవలకు సంబంధించి వైద్యులకు పలు సూచనలు ఇచ్చారు. ఈ విద్యార్థులు రెండురోజుల కిందట అన్నవరం దేవస్థానం దిగువన కిర్లంపూడి సత్రంలో దత్త హోమంలో పాల్గొని అక్కడ అన్న ప్రసాదం స్వీకరించినట్టు సమాచారం. అన్నప్రసాదమే వికటించి తీవ్రమైన గొంతు నొప్పి, కడుపు నొప్పితో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నట్టు తెలిసింది.

కొవ్వూరులో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ ఇవ్వాలి : పురందేశ్వరి

8



కడియంలో మహిళా సంఘాలు తయారుచేసిన ఉత్పత్తులను పరిశీలిస్తున్న మంత్రి, ఎమ్మెల్యేలు

మహిళాభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కృషి

- రూ.90 వేల కోట్లు మహిళలకు రుణాలు ఇస్తున్నాం
- ఏటా లక్ష మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా చేయడమే లక్ష్యం
- సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, సెర్ప్ శాఖల మంత్రి శ్రీనివాస్

6



కలెక్టరేట్‌లో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి, జేసీ తదితరులు

అంతరాన్ని తగ్గించడమే పీ4 లక్ష్యం : కలెక్టర్

అన్న క్యాంటీన్లలో ఆహార నాణ్యతపై అసంతృప్తి.. అధికారులు దృష్టి పెట్టాలి

రాజమహేంద్రవరం రూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మార్గదర్శి, బంగారు కుటుంబాల మధ్య అనుబంధం దీర్ఘకాలం ఉండాలన్నది ప్రభుత్వ ప్రధాన ఉద్దేశం అని జిల్లా కలెక్టర్ ప్రశాంతి పేర్కొన్నారు. ధనికులు, పేదల మధ్య అంతరం తగ్గించడమే పీ4 కార్యక్రమం లక్ష్యం అని అన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ జిల్లాల కలెక్టర్లతో అన్నదాత సుఖీభవ, పీ4 సానుకూల అభిప్రాయ సర్వే, నీటివనరుల పునరుద్ధరణ పథకాలపై గురువారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు సూచనలు చేశారు. అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి జిల్లా అధికారులకు కలెక్టర్ ప్రశాంతి పలు సూచనలు చేశారు. పీ4 మార్గదర్శకులుగా ఉండమని ఎవ్వరినీ ఒత్తిడి చేయరాదన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు మార్గదర్శకులుగా ఉండడానికి ఆసక్తి కనబరిస్తే ఆహ్వానించాలన్నారు. లక్ష్యాలకు అనుగుణంగా మార్గదర్శకులు, బంగారు కుటుంబాల ఎంపికను గడువులోగా పూర్తిచేయాలన్నారు. సానుకూల ప్రజాభిప్రాయ సర్వేలో సకాలంలో చెత్త తొలగింపుపై సానుకూల అభిప్రాయం వ్యక్తమైందని తెలిపారు. అన్న క్యాంటీన్లలో ఆహార నాణ్యత కొంత అసంతృప్తి ఉందని, దీనిపై సంబంధిత అధికారులు దృష్టిసారించా లన్నారు. మహిళలపై నేరాలు జరగకుండా కఠిన చర్యలు చేపట్టాలని, దీనికి తగిన ప్రచారం ఇవ్వాలని సూచించారు. వర్షపు నీటిని ఒడిసి పట్టాలన్నది సీఎం ఆలోచన కాగా, దీనికి అనుగుణంగా నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. కాలువలు సక్రమంగా ఉన్నాయా, వాటి ద్వారా చెరువులు నిండుతున్నాయా అనే అంశాలను పరిశీలించాలన్నారు. సాగునీటి, మంచి నీటి చెరువుల పునరుద్ధరణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో అమలవుతున్న ఆర్‌ఆర్‌ఆర్ పథకానికి ప్రతిపాదనలు సిద్ధంచేయాలని అధికారులను ఆదేశించారు. కొవ్వూరు, నిడదవోలులో ఉన్న పురపాలక సమస్యలపై దృష్టి సారిస్తామని జిల్లా కలెక్టర్ తెలిపారు. సమావేశంలో జేసీ చిన్నరాముడు, డీఆర్వో సీతారామమూర్తి, ముఖ్య ప్రణాళిక అధికారి అప్పలకొండ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

74 లక్షల మందికి 13 రకాల పెన్షన్లు : ఎమ్మెల్యే గోరంట్ల

కడియం, జూలై31(ఆంధ్రజ్యోతి): ప్రతీనెల 1వ తేదీ మధ్యాహ్నానికే రాష్ట్రవ్యాప్తంగా 74 లక్షల మందికి 13 రకాల పెన్షన్‌లు అందజేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదే అని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి తెలిపారు. కడియంలో గురువారం ఏడాది సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం జరిగింది. మంత్రి కె.శ్రీనివాస్‌తో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ ఏడాది పాలనలో జరిగిన అభివృద్ధిని తెలుపుతూ, సమస్యలు తెలుసుకుంటూ సుపరిపాలన కార్యక్రమం జరుగుతోందన్నారు. ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లికి వందనం పథకం అమలు చేసినట్టు తెలిపారు. త్వరలో 3 గ్యాస్ సిలెండర్లకు ఒకేసారి సొమ్ములు అందజేస్తారన్నారు. అలాగే 16 వేల మందికి ఉద్యోగాలు కల్పించారన్నారు. గత ప్రభుత్వ నిర్వాకం వల్ల జరిగిన తప్పులు సరిచేసుకుంటూ మరోవైపు సంక్షేమం, అభివృద్ధి దిశగా ప్రభుత్వపాలన సాగిస్తోందన్నారు. ఇంటింటికీ గోదావరి నీరు ఇచ్చేవిధంగా ప్రతిపాదనలు చేస్తున్నట్టు తెలిపారు. పేదరిక నిర్మూలన జరగాలనేది కూటమి ఉద్దేశం అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మోసిగంటి సత్యవతి, డాక్టర్ గోరంట్ల రవిరామ్‌కిరణ్, ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, అన్నందేవుల చంటి, మార్గాని సత్య నారాయణ, వెలుగుబంటి నాని, ప్రత్తిపాటి రామారావుచౌదరి, ముద్రగడ జమీ, కాశి నవీన్‌కుమార్, ఏఎంసీ చైర్మెన్ మార్ని వాసు, ఉపాధ్యక్షులు బోడపాటి గోపి, ఆదిమూలం సాయిబాబా పాల్గొన్నారు.



అధికారుల తీరుపై ప్రశ్నిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

నందరాడ, నరేంద్రపురం రైతు సేవా కేంద్రాల్లో కలెక్టర్ తనిఖీ

రాజానగరం, జూలై 31(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి పేర్కొన్నారు. పీఎం కిసాన్ యోజన, అన్నదాత సుఖీభవ పథకం అమలుతీరు పరిశీలనలో భాగంగా రాజానగరం మండలంలోని నందరాడ, నరేంద్రపురం రైతు సేవా కేంద్రాలను అధికారులతో కలిసి గురువారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అలాగే రికార్డులు నిర్వహణ, డాటా ఎంట్రీ, ఇతర అనుబంధ కార్యకలాపాల తీరుపై కలెక్టర్ సమీక్షించారు. రైతులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన వారికి సమర్థవంతంగా చేరాలంటే, క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న రెవెన్యూ, వ్యవసాయశాఖ సిబ్బంది కీలకపాత్ర పోషించాల్సిన అవసరం ఉందన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న నందరాడ వీఆర్వో సీహెచ్ మునితిరుపతి, దివాన్‌చెరువు-3కు చెందిన వీఆర్వో ఎం.సత్యనారాయణ (నరేంద్రపురం ఇన్‌చార్జ్) తీరుపై కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. తక్షణమే వారిని కలెక్టరేట్‌కు అటాచ్‌మెంట్ చేయాలని తహశీల్దార్ జి.అనంతలక్ష్మి సత్యవతిదేవిని ఆదేశించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ నరసింహకిషోర్

బ్యాంక్‌ల ఏటీఎంల వద్ద తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై ఎస్పీ సమీక్ష

రాజమహేంద్రవరంసిటీ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా పరిధిలో వివిధ బ్యాంక్‌లు, ఏటీఎం సెంటర్ల వద్ద తీసుకోవాల్సిన భద్రతాచర్యలపై ఎస్పీ డి.నరసింహకిషోర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో బ్యాంక్, సెక్యూరిటీ అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ ప్రతీ బ్యాంక్ వద్ద సీసీ కేమేరాలు, భద్రతాపరంగా తీసుకోవాల్సిన చర్యలు, పీపీటీ ద్వారా వివరించారు. ఏటీఎంల వద్ద జరిగే నేరాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని, అందులోభాగంగా బ్యాంక్ విధుల్లో నియమించుకునే తాత్కాలిక సిబ్బంది, ఔట్‌సోర్సింగ్ భద్రతా సిబ్బందికి ముందుగా పోలీస్ వెరిఫికేషన్ తప్పనిసరిగా చేయించాలని, ప్రతీ బ్యాంక్ ఏటీఎం వద్ద 24/7 పనిచేసే విధంగా నైట్ విజన్ హెచ్‌డీ సీసీ కేమేరాలు ఏర్పాటుచేసుకోవాలని, భద్రతా అలారం వ్యవస్థను ఏర్పాటుచేసుకోవాలని, విడిగా ఉన్న ఏటీఎంలు, బ్యాంక్‌ల వద్ద తప్పనిసరిగా సెక్యూరిటీ గార్డులను నియమించుకోవాలన్నారు. క్రైం అడిషనల్ ఎస్పీ ఆధ్వర్యంలో బ్యాంకులు, ఏటీఎంల వద్ద తీసుకోవాల్సిన భద్రతాపరమైన అంశాలపై బ్యాంకు, అధికారులు, సెక్యూరిటీ అధికారులతో మూడు నెలలకొకసారి రివ్యూ నిర్వహించాలని, జోనల్ డీఎస్పీలు బ్యాంక్, సెక్యూరిటీ అధికారులకు అవగాహనా కార్యక్రమాలను విధిగా నిర్వహించాలన్నారు. డిస్ట్రిక్ట్ లీడ్ బ్యాంక్ మేనేజర్ ప్రసాద్, అడిషనల్ ఎస్పీలు ఎన్‌బీఎం మురళీకృష్ణ, ఏవీ సుబ్బరాజు, ఎల్ అర్జున్, ఎస్‌బీ డీఎస్పీ బి రామకృష్ణ, పాల్గొన్నారు.

రేపు కలెక్టరేట్ వద్ద ధర్నా

తాళ్లపూడి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ, ఉద్యోగ పింఛనుదారుల 18 రకాల డిమాండ్ల సాధన కోసం ఆగస్టు 2వ తేదీన కలెక్టరేట్ వద్ద ఏపీ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నట్టు ఉపాధ్యాయ సంఘ నాయకుడు డీడీ రావు గురువారం తెలిపారు. ఆరోజు ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ధర్నా జరుగుతుందన్నారు.

నియోజకవర్గానికి 443 వితంతు పింఛన్లు మంజూరు

కొవ్వూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో నూతనంగా 443 వితంతు పింఛన్లు మంజూరైనట్టు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తెలిపారు. ఇందులో కొవ్వూరు మండలానికి 140, పట్టణానికి 57, చాగల్లు మండలానికి137, తాళ్లపూడి మండలాని 109 మంజూరయ్యాయన్నారు. స్థానిక రైల్వేస్టేషన్ వద్ద గల లిటరరీ క్లబ్ కల్యాణ మండపంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు పింఛన్లు పంపిణీచేయడం జరుగుతుందన్నారు.

జీడి పిక్కలు వేరు చేసే యంత్రం పరిశీలన



యంత్రాన్ని పరిశీలిస్తున్న హార్టికల్చర్ డైరెక్టర్ శ్రీనివాసులు

కొవ్వూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు పట్టణంలో జీడిపిక్కలు, పండును వేరు చేసే యంత్రాన్ని హార్టికల్చర్ డైరెక్టర్ డా. కే.శ్రీనివాసులు గురువారం పరిశీలించారు. విజయవాడ నుంచి రాజమహేంద్రవరం వెళ్తూ కొవ్వూరు వద్ద ఆగారు. నందమూరు రోడ్‌లో మాజీ మున్సిపల్ చైర్మన్ సూరపనేని సూర్య భాస్కర రామ్మోహన్(చిన్ని) అతిథి గృహం వద్ద ఉద్యాన రైతు ఏర్పాటు చేసిన జీడిపిక్కలు వేరుచేసే యంత్రాన్ని ఉద్యాన వర్సిటీ ఉప కులపతి డా.కే.గోపాల్, విస్తరణ సంచాలకుడు డాక్టర్ బీ.గోవిందరాజుతో కలిసి పరిశీలించారు. ఈ యంత్రం 1.2 లీటర్ల పెట్రోల్‌తో గంటకు 300 కిలోలు చొప్పన, రోజుకు 3 వేల కిలోల గింజలను కాయ నుంచి వేరుచేస్తుందని, అదే సంప్రదాయ పద్ధతిలో ఎకరం తోటకు రూ. మూడు వేలు ఖర్చు అవుతుందన్నారు. ఈయనతోపాటు ఏపీఎం ఐపీడీ పీడీ దుర్గేష్, జిల్లా ఉద్యాన అధికారి ఎన్.మల్లిఖార్జునరావు, కొవ్వూరు ఉద్యాన అధికారి డి.సుధీర్‌కుమార్, శాస్త్రవేతలు, ఉద్యాన వన సహాయకులు, రైతులు, తదితరులు ఉన్నారు.

సాధు అమ్మవారికి ప్రత్యేక పూజలు

ఉండ్రాజవరం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చివటంలో వెలసిన చివటం సాధు అమ్మవారి ఆలయం వద్ద గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నక్షత్ర, గ్రహ హోమాలు, చండీయాగం నిర్వహించారు. రాత్రి వీరభద్రేశ్వర స్వామివారి కల్యాణం జరిపారు. మూడు రోజుల పాటు జరిగిన పూజా కార్యక్రమాలు విజయవాడకు చెందిన జ్యోశ్యుల శ్రీనివాస్, కావ్యశ్రీ దంపతుల ఆర్థిక సహాయసహకారాలతో నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

నేటి నుంచి భూ రీసర్వే

దేవరపల్లి, జూలై31 (ఆంధ్రజ్యోతి): ఆగస్టు 1వ తేదీ నుంచి ప్రభుత్వం భూ రీసర్వే నిర్వహించటం జరుగుతుందని ఎంపీడీవో వై.రాజారావు పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద పంచాయతీ కార్యదర్శులకు, గ్రామ సచివాలయ ఉద్యోగులకు రీసర్వే పై గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో ఉన్న పారిశుధ్యం పైన ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, అలాగే బంధపురం, చిన్నాయిగూడెం, దేవరపల్లి, కురుకూరు, యాదవోలు, యర్నగూడెం, తదితర గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు, వీఆర్వోలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత



మొక్క నాటుతున్న ఎంపీపీ సత్యనారాయణ

గోపాలపురం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని ఎంపీపీ ఉండవల్లి సత్యనారాయణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గురువారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. మొక్కలతోనే మానవ మనుగడ ముడిపడి ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజమనోహర్, పంచాయతీ కార్యదర్శులు అనురాధ, వెంకాయమ్మ, ఏపీవో జేవీరమణ పాల్గొన్నారు.

ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య

కొవ్వూరు, జూలై 31(ఆంధ్రజ్యోతి): అనారోగ్యానికి గురై తీవ్ర మనస్థాపం చెంది ఇంట్లో ఉరి పోసుకుని ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్టు కొవ్వూరు పట్టణ హెడ్ కానిస్టేబుల్ ఆర్. సత్యనారాయణ తెలిపారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం... పట్టణంలోని క్రిస్టియన్‌పేటకు చెందిన చిగురుపాటి శ్రీనివాస్ (56) టీవీ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. ఈయనకు భార్య ప్రియదర్శిని, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. అయితే ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో అప్పులుచేసి వైద్యం చేయించుకున్నాడు. ఎప్పటికీ ఆరోగ్యం కుదుటపడకపోవడంతో మనస్థాపం చెంది బుధవారం రాత్రి ఇంట్లో చీరతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి పోసుకున్నాడు. ఉదయం భర్తను చూసి భార్య ప్రియదర్శిని పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హెచ్‌సీ సత్యనారాయణ తెలిపారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే



మద్దూరులంకలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమం, అభ్యున్నతే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. మద్దూరులంకలో గురువారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్థానిక టీడీపీ నాయకులతో కలిసి ఇంటింటా తిరిగి ఏడాది కూటమి పాలనలో అమలుచేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాల వైసీపీ పాలనలో రాష్ట్రం అభివృద్ధిలో కుంటుపడిందన్నారు. అలాగే కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తుందని, ప్రజలు ప్రభుత్వానికి అండగా ఉండాలన్నారు. కార్యక్రమంలో గ్రామ టీడీపీ నాయకులు కప్పల సుదర్శన్, కే. వెంకటేష్, ఆకుల వీవీ సత్యనారాయణ, అల్లం అప్పారావు, సలాది సత్యనారాయణ, గుమ్మల రాంబాబు, కే.శ్రీను, టి.రాజేష్, కే. చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

'పైడిమెట్ట ఎత్తిపోతల పథకం అభివృద్ధికి చర్యలు తీసుకోండి'



మంత్రి నిమ్మలకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

తాళ్లపూడి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): అన్నదేవరపేట, గజ్జరం, పోచవరం గ్రామాల రైతాంగానికి సాగునీటి అవసరాలు తీర్చే పైడిమెట్ట ఎత్తిపోతల పథకం అభివృద్ధికి తక్షణ చర్యలు తీసుకోవాలని మంత్రి నిమ్మల రామానాయుడుని కోరినట్టు ఆ స్కీము అధ్యక్షుడు ముల్పూడి రామచంద్రం గురువారం తెలిపారు. 2003లో ప్రారంభమైన ఈ పథకం పంపుహౌస్‌లో 750 హెచ్‌పీ, 11 కేవీ ట్రాన్స్‌ఫారం, మో టార్లు, పంపులు మరమ్మతులకు గురై లక్ష్యం మేరకు సాగునీటి సరఫరా జరగడం లేదన్నా రు. ఇటీవల ట్రాన్స్‌ఫారం కాలిపోయిందన్నారు. అందువల్ల రైతుల వ్యవసాయ అవసరాలను గుర్తించి కొత్త ట్రాన్స్‌ఫారం ఏర్పాటుచేయడంతో పాటు పంపింగ్ స్కీమ్ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గన్నిన సత్తిబాబు, మండా గోవింద్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

కొవ్వూరులో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ ఇవ్వాలి : ఎంపీ



సతీష్‌కుమార్‌కు వినతి అందజేస్తున్న పురందేశ్వరి

కొవ్వూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరులో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్‌ను పునరుద్ధరించాలని రైల్వే బోర్డు చైర్మన్‌కు రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు ఢిల్లీ రైల్వేభవన్‌లో చైర్మన్ సతీష్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అలాగే రానున్న గోదావరి పుష్కరాల నేపథ్యంలో రాజమహేంద్రవరం, గోదావరి, కొవ్వూరు, నిడదవోలు, అనపర్తి రైల్వేస్టేషన్లలో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని కోరారు. ప్రధానంగా కొవ్వూరు, అనపర్తి రైల్వేస్టేషన్లలో రైళ్ల హాల్టింగ్‌ను తిరిగి పునరుద్ధరించాలని బీజేపీ నేతలు కోరుతున్నారు.

ఆయిల్‌పామ్ గెలల కోత కార్మికులకు అవగాహన సదస్సు



మాట్లాడుతున్న 3ఎఫ్ ఆయిల్‌పామ్ జీఎం విజయప్రసాద్

దేవరపల్లి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఆయిల్ పామ్ గెలలు కోసే కార్మికులు తప్పనిసరిగా భద్రతా నియమాలు పాటించాలని 3ఎఫ్ ఆయిల్‌పామ్ జనరల్ మేనేజర్ విజయప్రసాద్ అన్నారు. గురువారం దేవరపల్లిలో 3ఎఫ్ ఆయిల్‌పామ్ ప్లాంటేషన్‌లో గెలల కోత కార్మికులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయిల్‌పామ్ గెలల కార్మికులు తప్పనిసరిగా జీవిత బీమా చేయించుకోవాలని, అలాగే రక్షణ కిట్లు ఉపయోగించాలన్నారు. దీనిలో భాగంగా సుమారు 127 మంది కార్మికులకు 3ఎఫ్ ఆయిల్ పామ్ సంస్థ ద్వారా ఉచితంగా గమ్‌బూట్లు, కళ్లజోళ్లు, హెల్మెట్లు పంపిణీ చేశారు. ఇంకా ఇన్సూరెన్స్ చేసుకోని కార్మికులెవరైనా చేయించుకోవాలన్నారు. 3ఎఫ్ ఆయిల్‌పామ్ మేనేజర్ హనుమాన్, డిప్యూటీ జనరల్ మేనేజర్ ఆర్.సూర్యారావు, బీ.శ్రీనివాసరావు, అసిస్టెంట్ మేనేజర్ రాజేశ్,కే.నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోంది



అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

పెరవలి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి రాజ్యాంగాన్ని విస్మరిస్తోందని, ఇటువంటి విధానాలు దేశానికి చాలా ప్రమాదకరమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం మురళీకృష్ణ అన్నారు. గురువారం పెరవలిలో కాంగ్రెస్ పార్టీ ప్రజా స్వామ్య పరిరక్షణ - రాజ్యాంగ పరిరక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఇంటింటా తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు బుద్దాన లక్ష్మణరావు, మేడవరపు భద్రం దొర, మహ్మద్ జామీర్ రహమాన్, మహ్మద్ అన్వర్ ఖాన్, కాకి కిషోర్ పాల్గొన్నారు.

పీ4లో ప్రతిఒక్కరూ మార్గదర్శకులుగా చేరాలి : ఎంపీడీవో



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రాజమనోహర్

గోపాలపురం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలన కోసం ప్రభుత్వం సంకల్పించిన పీ4 కార్యక్రమంలో ప్రతిఒక్కరూ మార్గదర్శకులుగా చేరాలని ఎంపీడీవో జీ.రాజమనోహర్ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పీ4 పై మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో గురువారం సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకు సుమారు 400 మందికి పైగా బంగారు కుటుంబాలను ఎంపిక చేయ డం జరిగిందన్నారు. వారిని ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నిబంధనలకు లోబడి వారి అభివృద్ధికి ప్రభుత్వ ఉద్యోగులు సైతం మార్గదర్శకులుగా చేరవచ్చన్నారు. అలాగే ప్రభుత్వం 1వ తేదీన పంపిణీ చేయనున్న ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ కార్యక్రమానికి సర్వం సిద్ధం చేసినట్టు చెప్పారు. మండల వ్యాప్తంగా పాత పింఛన్లతో పాటు మరో 163 వితంతు పింఛన్లు మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ముగ్గురి అరెస్టు

కొవ్వూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): దొంగతనాలకు పాల్పడిన ముగ్గురుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం పట్టణంలో దొంగతనాలకు పాల్పడిన పట్టణానికి చెందిన ఎలుబండి నాగ దుర్గాపవన్, యర్రంశెట్టి అంజి, దొమ్మేరుకు చెందన గూడా ఫణికుమార్‌ను గురువారం అరెస్టు చేశామన్నారు. అలాగే వారి వద్ద నుంచి రెండు గ్యాస్ సిలిండర్లు, మూడు మోటారుసైకిళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరిని కోర్టులో హాజరుపర్చగా 14 రోజులు రిమాండ్ విధించారన్నారు.

సేంద్రియ వ్యవసాయం చేయండి : ఏవో

నల్లజర్ల, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రసాయన ఎరువుల వినియోగం తగ్గించి, సేంద్రియ పద్ధతి ద్వారా పంటలు పండించాలని ఏవో సోమశేఖర్ అన్నారు. గురువారం నల్లజర్లలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రసాయన ఎరువులు, పురుగు మందులు మోతాదుకు మించి ఉపయోగించడం ద్వారా ప్రజలు అనారోగ్యం చెందుతు న్నారని, క్రమేపి సేంద్రియ పంటలు పండించే దిశగా రైతులు కార్యాచరణ చేయాలని కోరారు.

'మానవత' నూతన కమిటీ ప్రమాణస్వీకారం

దేవరపల్లి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా సేవా కార్యక్రమాలు విస్తృతం చేయాలని మానవత సంస్థ రీజనల్ అధ్యక్షుడు చంద్రయ్య, జిల్లా అధ్యక్షుడు గంగాధరరావు పేర్కొన్నారు. దేవరపల్లిలో కేసిరాజు సీతారామయ్య ఇంటి వద్ద జరిగిన మానవత సంస్థ మండల కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. అనంతరం కమిటీ సభ్యులతో ప్రమాణస్వీకారం నిర్వహించారు. ఈ సందర్భం గా మండల మానవత సంస్థ అధ్యక్షుడిగా సూర్యప్రకాశరావు మాట్లాడుతూ మానవత స్వచ్ఛంద సంస్థ ద్వారా పలు సేవా కార్యక్రమా లు నిర్వహించడానికి తనవంతు కృషి చేస్తానని దేవరపల్లి మండలానికి ప్రముఖ పారిశ్రామిక వేత్త కరుటూరి ధనుంజయ శాంతిరథం అందజేశారని ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. సభ్యత్వాలు మండలంలోని మానవత సభ్యత్వాలు వేగవంతం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మానవత సంస్థ మండల అధ్యక్షునిగా బండి సూర్యప్రకాశరావు, ఉపాధ్యక్షునిగా ఆచంట సుభాష్‌చంద్రబోస్, కార్యదర్శి కే.నరేశ్‌వర్మ, సహాయ కార్యదర్శి కే.రవికుమార్, కోశాధికారి లక్ష్మీనారాయణ, బీసీ సభ్యులుగా విద్యాకమిటీకి నలమాటి లలిత, వైద్యానికి ఆకుల నాగేశ్వరరావు, అవర్‌నెస్ కమిటీ అధ్యక్షుడిగా శివరామ్‌కుమార్, ఎమర్జెన్సీకి పచ్చా రామ్‌గోపాల్ నియమితులు కాగా జిల్లా కమిటీ చైర్మన్‌గా బళ్లా సూర్యచక్రం, వైస్ చైర్మన్ పప్పు వెంకటరామారావు, కన్వీనర్‌గా కే.రామ చంద్రరాజు నియమితులయ్యారు. కార్యక్రమంలో కే.సూర్యనారాయణ, కేసిరాజు రాజ్‌కుమార్, తీగల బలరామయ్య పాల్గొన్నారు.

శానిటేషన్‌పై ప్రత్యేక చర్యలు చేపట్టాలి



దేవరపల్లిలో స్థానికులతో మాట్లాడుతున్న కోఆర్డినేటర్ పద్మిని

దేవరపల్లి, జూలై 31 (ఆంధ్ర జ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత పంచాయతీ అధికారులపై ఉందని స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ జిల్లా కోఆర్డినేటర్ పద్మిని అన్నారు. గురువారం దేవరపల్లిలోని పలు వీధుల్లో ఆమె పర్యటించి శానిటేషన్‌పై ప్రజలను వివరాలు అడిగి తెలుసు కున్నారు. ఈ సందర్భంగా పద్మిని మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పంచాయతీ కార్యదర్శులు శానిటేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అలాగే మురుగు దొడ్ల నిర్వహణలో కూడా గ్రామస్థులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎస్.రవికిషోర్, గ్రామ సచివాలయ ఉద్యోగులు సమీన బేగం, బాల కుమారి, పంచాయతీ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

మహిళాభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కృషి

- రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, సెర్ప్, ఎన్ఆర్ఐ సాధికారిత శాఖల మంత్రి శ్రీనివాస్



కడియంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో మంత్రి శ్రీనివాస్, గోరంట్ల

కడియం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మహిళ బాగుంటే.. ఆ కుటుంబం బాగుంటుంది.. అనే ఉద్దేశంతో మహిళాభ్యున్నతికి కూటమి ప్రభు త్వం విశేష కృషి చేస్తోందని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, సెర్ప్, ఎన్ఆర్ఐ సాధికారిత శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. గురువారం కడియంలో ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ఆధ్వర్యంలో ఏడాది 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ మహిళల ఆరోగ్యం దృ ష్ట్యా గతంలోనే రూ. 10 వేల విలువ చేసే దీపం పథకాన్ని ఎంతోమంది మహిళలకు ఆనాడు సీఎం చంద్రబాబునాయుడు అందజేశారన్నారు. సీఎం చంద్రబాబునాయుడు 30 ఏళ్ల కిందటే రూ.10 వేలు పొదుపు ఇస్తాం.. మీరు రూ.10 వేలు కలిపి అభివృద్ధి చెందండి అని పదిమంది మహిళా సభ్యులతో డ్వాక్రా సంఘాన్ని రాష్ట్రంలో ప్రవేశపెట్టారని, అటువంటి డ్వాక్రా సంఘాలు ఐదేళ్ల తరువాత దేశంలో అన్ని రాష్ట్రాల్లో నెలకొల్పారన్నారు. ప్రతీ ఏటా లక్ష మంది పారిశ్రామికవేత్తలను తయారుచేయాలని సీఎం చంద్రబాబునాయుడు ఆదేశాలు ఇచ్చారన్నారు. అందు కోసం మహిళలకు రుణాలు ఇప్పించడంతో పాటు వారికి శిక్షణ ఇప్పిస్తున్నట్టు తెలిపారు. వారి పిల్లల చదువుకోసం, వివాహాల కోసం, ఆరోగ్యం కోసం ఇలా స్త్రీనిధి కింద మహిళలకు రూ.లక్ష ఇవ్వడం జరుగుతుందన్నారు. కూటమి ఏర్పడిన ఏడాది కాలంలో గత నాలుగు నెలలుగా రాష్ట్ర వ్యాప్తంగా 27 వేల కోట్లు రుణాలు ఇవ్వడం జరిగిందన్నారు. మొత్తం 90 వేల కోట్ల రుణాలు మహిళలకు ఇవ్వనున్నామన్నారు. అలాగే అర్హులైన ప్రతీ ఒక్కరికి రూ.4 వేలు, దివ్యాంగులకు రూ.6 వేలు, దీర్ఘకాలిక సమస్యలు ఉన్న వారికి రూ.10 వేలు, మంచానికే పరిమితమైన వారికి రూ.15 వేల పెన్షన్‌ను ప్రభుత్వం అందిస్తోందన్నారు. రైతులకు ఆగస్టు నెల నుంచి రూ.7 వేల చొప్పున 2 దఫాలుగాను, ఓ దఫా రూ.6 వేల చొప్పున మొత్తం రూ. 20 వేలను ప్రభుత్వం అందిస్తోందన్నారు. వైద్యం కోసం సీఎం రిలీఫ్ ఫండ్ కింద కోట్లాది రూపాయలను ప్రభుత్వం అందిస్తోందన్నారు. గ్రామాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని, కూటమి పాలనలో ఇప్పటివరకు ప్రతీ గ్రామంలో రూ.25 లక్షల నుంచి రూ. 50 లక్షల అభివృద్ధి జరిగిందన్నారు. గత ప్రభుత్వంలో పెట్టుబడులు పెట్టడానికి వచ్చేవారిని బెదరగొట్టి పెట్టుబడులు రాకుండా చేశారని, అయితే కూటమి ఏర్పడిన ఏడాది కాలంలో రాష్ట్రానికి రూ. 8 లక్షల కోట్లు పెట్టుబడులు వచ్చాయన్నారు. హైదరాబాదులో హైటెక్ సిటీ మాదిరిగా ప్రస్తుతం అమరావతి అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. గతంలో ఒక్క చాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన నాయకుడి వల్ల 20 ఏళ్ల రాష్ట్రాభివృద్ధి వెనుకకుపోయిందని మంత్రి శ్రీనివాస్ ఆరోపించారు.

క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం అందజేత



పౌష్టికాహారం అందిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సంధ్య

కొవ్వూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): టీబీ వ్యాధి బారినపడిన రోగులు చికిత్సతో పాటు పౌష్టికాహారం తీసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డా.కే.సంధ్య తెలిపారు. ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్‌లో భాగంగా క్రిస్టియన్‌పేట అర్బన్‌హెల్త్ సెంటర్‌లో గురువారం 20 మంది క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సంధ్య మాట్లాడుతూ టీబీ రోగులు కుటుంబ సభ్యులతో మెలిగినప్పుడు తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. దేశంలో క్షయ మరణాల సంఖ్య తగ్గుముఖం పడుతోందన్నారు. 2030 నాటికి క్షయ రహిత దేశంగా భారత్‌ను తీర్చిదిద్దడానికి ప్రతిఒక్కరూ కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డా.ఎస్.ధర్మరాజు, డా.కిషోర్‌నాయక్, డా.నవీన్, సీనియర్ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్ బి.భాగ్యలక్ష్మి, భీమరాజు, సమీర్, కిరణ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పేపర్ దినోత్సవం

కొవ్వూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : కొవ్వూరు సంస్కృత పాఠశాలలో గురువారం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పెనుమాక జయరాజు ఆధ్వర్యంలో పేపర్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులకు కాగితం తయారీ, దాని ప్రాముఖ్యత గురించి వివరించారు. కార్యక్రమంలో పాలెంపాటి చినబాబు, యనమదల సుబ్రహ్మణ్యం, గోవర్ధనం శ్రీనివాసమూర్తి, మన్యం బుల్లిబాబు, బూరుగుపల్లి వెంకటేశ్వరరావు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

'రేషన్ డీలర్లపై ఒత్తిడి తగ్గించాలి'



నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు

నల్లజర్ల, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రేషన్ డీలర్లపై పనిభారం తగ్గించి కమీషన్ పెంచాలని మండల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు చీమకుర్తి నరసింహమూర్తి అన్నారు. గురువారం నల్లజర్ల మామిడి అశోక్‌కుమార్ (ఆబాస్) అపార్టుమెంట్ వద్ద సర్వ సభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో డీలర్ల సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు నరసింహమూర్తి మాట్లాడుతూ 65 సంవత్సరాలు నిండిన వృద్ధులు, దివ్యాంగులకు ఇంటికి వెళ్లి రేషన్ అందిస్తున్నామని, దీని ద్వారా డీలర్లకు ఖర్చులు పెరుగుతున్నాయని, దీనిపై వెంటనే ప్రభుత్వం స్పందించి కమీషన్ పెంచాలని డిమాండ్ చేశారు. 10 సంవత్సనాల నుంచి రూపాయి కమీషన్ మాత్రమే ఇస్తున్నారన్నారు. తెలంగాణ లాగ రెండు రూపాయల కమీషన్ ఇవ్వాలన్నారు. ఇందులో ఉపాధ్యక్షుడిగా దూళిపాల వెంకన్న, కార్యదర్శిగా ప్రతిపాటి లతామం గేష్కర్, సహాయ కార్యదర్శిగా బాయిశెట్టి లక్ష్మణరావు, కోశాధికారిగా ఈపిచర్ల కృష్ణ, గౌరవ అధ్యక్షుడిగా చీమకుర్తి చంద్రశేఖర్‌ను ఎన్నుకున్నారు. అనంతరం పలువురు మాట్లాడారు. కార్యక్రమంలో మామిడి అశోక్ కుమార్, చెల్లు మోజేష్, చీమకుర్తి నాగు, తాడిగడప మహేష్, అచ్యుత భాస్కరరావు, కే.నాగు, మంగతాయారు, పద్మావతి, మంగారావు, ప్రసాద్, కామేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు.

అంతర పంటలతో అధిక ఆదాయం



కలవలపల్లిలో ఉద్యాన తోటలను పరిశీలిస్తున్న డైరెక్టర్ శ్రీనివాసరావు

చాగల్లు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రైతులు ఉద్యాన తోటల్లో అంతరపంటలు సాగుచేస్తే అధిక ఆధాయం పొందవచ్చునని ఉద్యాన శాఖ, సెరీకల్చర్ డైరెక్టర్ డాక్టర్ కే. శ్రీనివాసరావు అన్నారు. గురువారం కలవలపల్లిలో రైతు ముళ్లపూడి మురళీకృష్ణ పామాయిల్ తోటలో అంతర్‌పంటగా మిరియాలు, దాల్చిన చెక్క, జాజికాయ పండించి మంచి ఫలితాలు సాధిస్తున్నాడు. ఈ సందర్భంగా ఆయన తోటలను వైఎస్ఆర్ హెచ్ యూనివర్సిటీ ఉప కులపతి డాక్టర్ కే. గోపాల్, బి గోవిందరాజుతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఇతర రైతులకు ఈయన ఆదర్శంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఏపీఎంఐపి పిడి దుర్గేష్, జిల్లా ఉద్యాన అధికారి ఎన్ మల్లిఖార్జునరావు, శాస్త్రవేత్త డీ. సుధీర్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్‌కే కళాశాల ఎదుట విద్యార్థుల ఆందోళన

- సీనియర్ లెక్చరర్లను తొలగించారని ఆరోపణ



నల్లజర్లలో కళాశాల వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు

నల్లజర్ల, జూలై 31 (ఆంధ్రజ్యోతి): నల్లజర్ల ఎస్ఆర్‌కే కళాశాల వద్ద ఆ కళాశాల విద్యార్థులు గురువారం ఆందోళనకు దిగారు. 20 సంవత్సరాల నుంచి బోటనీ,జువాలజీ బోధించే లెక్చరర్స్‌కు మూడు నెలల నుంచి జీతాలు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టడంతో వారు కళాశాల యాజమాన్యాన్ని ప్రశ్నించారు. ప్రశ్నించిన ఆ లెక్చరర్లపై కళాశాల యాజమాన్యం మూడు నెలలు జీతం ఇచ్చేస్తాం . కళాశాల నుంచి వెళ్లిపోవాలని హెచ్చరించింది. దీంతో సదరు లెక్చరర్లు సమస్యను ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు దృష్టికి తీసుకొచ్చారు. ఈ క్రమంలో మూడు నెలల జీతాలను చెక్కుల రూపంలో తీసుకుని లెక్చరర్లు కళాశాలకు రావడం మానేశారు. దీంతో విద్యార్థులు అనుభవం ఉన్న లెక్చరర్స్‌ను కక్షతో పంపించి వేస్తే మాకు బోటనీ, జువాలజీ ఎవరు చెబుతారు... కొత్త వారికి అంత అనుభవం ఉంటుందా... మా భవిష్యత్ ఏంటి అని ఆందోళన చేశారు. దీనిపై కళాశాల కరస్పాండెంట్ గన్నమని దొరయ్యను వివరణ కోరగా, ఆ అధ్యాపకులు క్లాసులకు వెళ్లడం లేదని, విద్యార్థులను రెచ్చగొట్టి సమస్యలు సృష్టిస్తున్నారని, వారికి ఇవ్వాల్సినవన్నీ పెద్దల సమక్షంలో ఇవ్వడం జరిగిందన్నారు.